

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

27-9-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 238 పేజీలు: 16 వెల: 8.00



నకిలీ ఆధార్‌ను పట్టే అద్భుత వ్యవస్థ ఆవిర్భావం

నాగాలాండ్‌లో కల్తీ మద్యం సేవించి 19 మంది మృతి

5




నాగావళి ఉగ్రరూపం



శ్రీకాకుళంలో భారీవర్షాలకు దెబ్బతిన్న అరటి తోటలు



శనివారం ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి

# వరద నీటి నిల్వకు బ్యారేజ్‌లు

● పులిచింతల దిగువన, ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువన నిర్మాణానికి ప్రతిపాదనలు ● రాష్ట్రంలో 50 నుంచి 31 శాతానికి తగ్గిన వర్షపాతం లోటు ● మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల ఉచిత బియ్యం పంపిణీ ● టెలికాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

**అమరావతి,సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:**వరద జలాలను పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునేందుకు పులిచింతల దిగువన, ప్రకాశం బ్యారేజీకి ఎగువన బ్యారేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గినా ఉత్తరాంధ్రలో ఎగువ ప్రాంతాల నుంచి నదుల్లోకి వరద ప్రవాహాలు కొనసాగుతున్నాయనందు ఆ దిశలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలో వరద అనంతర పరిస్థితిపై సిఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ >>2

## గోదావరి ఉధృతి 5 లక్షల క్యూసెక్కులు

**ధవళేశ్వరం,సెప్టెంబరు 26,ప్రభాతవార్త:** గోదావరిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 5 లక్షల క్యూసెక్కులకు చేరడంతో అధికారులు అప్రమత్త మయ్యారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండటంతో రాత్రికి తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. గోదావరి వరద పరిస్థితులపై విపత్తుల నిర్వహణ సంస్థ సంబంధిత అధికారులను అప్రమత్తం చేసింది. పోలవరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, ఏలూరు, కోనసీమ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. గోదావరి పరివాహక ప్రాంతాలు, ముఖ్యంగా లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



శనివారం మీడియాతో మాట్లాడుతున్న సిఇసి జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి

# ఇసిలో విభేదాల్లేవు..

● 'సర్'పై ముగ్గురిది ఏకాభిప్రాయమే ● డిక్లరేషన్‌ను సమర్థించిన సుప్రీంకోర్టు ● విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చిన ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ● ఇసిఐనెట్ సమీక్షకు ప్రత్యేక కమిటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే మీడియా నివేది కల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శనివారం క్లారిటీ ఇచ్చింది. ప్రధాన ఎన్నికల కమి షనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో సమావేశమయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, కొత్తఓటర్ల నమోదు, ఇసిఐ నెట్, క్యాబి నెట్ సెక్రటరీకి పంపిన లేఖ తదితర అంశాలపై ఇసి వివరణ ఇచ్చింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి జ్ఞానేష్ కుమార్‌తో ఇద్దరు కమిషనర్లు విభేదించి నట్లు ఆంగ్లపత్రిక నివేదించింది. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్ 6లోమార్పులు, ఓటర్ల జాబితా యాక్సెస్, >>2

**'సర్' అభ్యంతరాలపై 30న ఇండియా కూటమి భేటీ**

**జ్ఞానేశ్ తొలగింపునకు మూడో నోటీసు సిద్ధం చేస్తున్న విపక్ష నేతలు** 2లో

## హోటళ్లు, రెస్టారెంట్ల ఆకస్మిక తనిఖీలు

### 25 సంస్థల మూసివేత

**విజయవాడ,సెప్టెంబరు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆహార భద్రత శాఖ అధికారులు శనివారం విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 28 జిల్లాల్లో ఒకేసారి చేపట్టిన ఈ తనిఖీల్లో 70 హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార సంస్థలను పరిశీలించారు. నిబంధన లను తీవ్రంగా ఉల్లంఘించిన 25 సంస్థలను మూసివేశారు. 30 చట్టపరమైన కేసులు నమోదుచేశారు. మిగిలిన 15 సంస్థలకు నోటీ సులు జారీచేశారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలతో కూడిన నివే దికను అధికారులు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు సమర్పించారు. ఈ రాష్ట్రవ్యాప్త తనిఖీలను ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి. వీరపాండియన్ ఆహార భద్రత శాఖ సంచాలకులు, ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం డీజీ సి. అరుణ్‌బాబు, పర్యవేక్షించారు. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ బి. శ్రీనివాస్‌తో పాటు 40 మంది ఆహార భద్రత అధికారులు, 13 మంది సహాయ ఆహార నియంత్రణ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీల్లో పాల్గొన్నారు.

# నీటి నిర్వహణలో లోపాలు సహించం

## ప్రజారోగ్య పరిరక్షణకే ప్రథమ ప్రాధాన్యం

సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా సమర్థంగా అమలు

సిపిడబ్ల్యుఎస్ పథకాలు, పర్యవేక్షణ పటిష్టం చేయండి

అధికారులకు డి.సిఎం పవన్ కల్యాణ్ ఆదేశం



**విజయవాడ,సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన, నాణ్యమైన మంచి నీటిని నిరంతరాయంగా అందించే సమగ్ర రక్షిత నీటి పథకాల నిర్వహణ, పర్యవేక్షణను పటిష్టపరచాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉన్నతాధికారులతో సమీక్షించారు. సిపిడబ్ల్యూఎస్ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని ఉప ముఖ్యమంత్రిస్పష్టం చేశారు. ముఖ్యంగా తాను గుర్తించిన ఫిల్టర్ ఛాంబర్లు, బెడ్ల నిర్వహణకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 512 సిపిడబ్ల్యూఎస్ పథకాల ద్వారా 11,221 నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరుగు తోందని, సుమారు 1.65 కోట్ల మంది ప్రజలు ఈ పథకాలపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి పథకం పరిశుభ్రంగా, సురక్షి తంగా, పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అన్ని పథకాలపై గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ అధికారులు, జెడ్పీ సిఇఒలు సంయుక్తంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిం చాలని ఆదేశించారు. నీటి వనరులు, శుద్ధి కేంద్రాలు, పంప్ హౌస్‌లు, ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, వాల్వులు తదితర మౌలిక వసతుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**ఫిల్టర్ బెడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

తాగు నీటి నాణ్యత పరిరక్షణలో ఫిల్టర్ బెడ్లు కీలకమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఫిల్టర్ హౌస్‌లను అత్యంతపరిశుభ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. కప్పలు, బల్లులు, ఎలుకలు, పాములు, కీటకాలు వంటి జీవులు ఫిల్టర్ బెడ్లలోకి ప్రవేశించకుండా అన్ని ఓపెనింగ్‌లకు రక్షణ వలలు ఏర్పాటు చేయాలని సూచించారు. శుద్ధి చేసిన నీటి నాణ్యతను భౌతిక, రసాయన, బ్యాక్టీరియాలజికల్ ప్రమాణాల ప్రకారం నిరంతరం పరీక్షించాలని, ఏవైనా వ్యత్యాసాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. వెంటిలేటర్లు, ఓవర్‌ఫ్లో పైపులు, డ్రెయిన్ అవుట్‌లెట్లకు తుప్పు పట్టని మెష్ స్క్రీన్లుఅమర్చాలని, ఫిల్టర్ మీడి యాను నిర్దేశితమందం మరియు నాణ్యత ప్రమా ణాలకు అనుగుణంగా నిర్వహించాలని, అవసర మైన మేరకు స్క్రాపింగ్, బ్యాక్‌వాషింగ్, శుభ్రపరిచే పనులు క్రమం తప్పకుండా చేపట్టడంతో పాటు ఇన్‌లెట్, అవుట్‌లెట్ వ్యవస్థలు, >>2

## పరవాడ ఫార్మాసిటీలో 95 పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు

**పరవాడ, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** పరవాడ ఫార్మాసిటీలో కాలుష్యంపై ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) కొరడా ఝుళిపించింది. సోషల్ మీడియాలో వచ్చిన ఫిర్యాదులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో పిసిబి అధికారులు ఫార్మాసిటీ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో నమూనాలు సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థాలతో కూడిన నీటిని వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేసినట్లు అధికారులు గుర్తించారు. ఫార్మాసిటీ పరిధిలోని 95 పరిశ్రమ లకు పిసిబి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మురుగు కాలువల్లో నల్లటి రంగు నీరు ప్రవహిం చడం, దుర్వాసన వస్తున్నట్లు సోషల్ మీడియాలో వచ్చిన వీడియోపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి వాస్తవ పరిస్థితులను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో పరిశ్రమలు వర్షపు నీటిని నిల్వ చేసుకునే ఏర్పాట్లు చేయాలని, మురుగునీరు, కలుషిత నీటిని పరిశ్రమల వెలుపలికి >>2

# కర్నూలుకు ఏవియేషన్ కళ

పైలట్ శిక్షణ కేంద్రం ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

నైట్ లాండింగ్, అదనపు విమాన సర్వీసులపై ప్రత్యేక దృష్టి

భవిష్యత్‌లో మరిన్ని ఎఫ్‌టిఒలు



శనివారం కర్నూలు విమానాశ్రయంలో ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీకి చెందిన ఎఫ్‌టిఒను జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**కర్నూలు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** ఆంధ్ర ప్రదేశ్‌ను దేశంలో కీలక ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చేయడమే సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని.. కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా తీర్చిదిద్దు తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కర్నూలును దేశంలోని బలమైన ఏవియేషన్ హబ్‌లలో ఒకటిగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నా యని పేర్కొన్నారు. కర్నూలు విమానాశ్రయంలో శనివారం ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీకి చెందిన ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టిఒ)ను కేంద్రమంత్రి ప్రారంభించారు. >>2



## కృష్ణపై మరో రెండు భారీ వంతెనలు

నాలుగు ప్యాకేజీలుగా అమరావతి ఓఆర్ఆర్

కంచికచర్ల సమీపంలోని విజయవాడ-హైదరాబాద్ నేషనల్ హైవే వద్ద ఓఆర్ఆర్

జాతీయ రహదారుల సంస్థ భారీ ప్రతిపాదనలు

**విజయవాడ, సెప్టెంబరు26, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి ఔటర్ రింగ్ రోడుకు (ఓఆర్ఆర్) అనుసంధానంగా కృష్ణానదిపై రెండు చోట్ల భారీ వంతెనలు, మూడు సొరంగాలు సహా అన్ని నిర్మాణ పనులను ఈ నాలుగు ప్యాకేజీల్లోనే పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. మొత్తం 195.13 కిలోమీటర్ల మేర ఈ ప్రాజెక్టును నిర్మించ నున్నారు. అనుసంధాన నిర్మాణాలను నాలుగు ప్యాకేజీలుగా నిర్మించనున్నారు.

అమరావతి ఓఆర్ఆర్ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.30,491 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో నాలుగు ప్యాకేజీల సివిల్ పనులకు రూ.10,595.70 కోట్లు అవసరమని అంచనా వేశారు. భూసేకరణ కోసం రూ.5,315 కోట్లు వెచ్చించనున్నారు. మిగిలిన వ్యయం పర్యావరణ, అటవీ అనుమతులు, విద్యుత్ లైన్ల మార్పులు, ఇతర మౌలిక పనులు, అలాగే హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) కింద 15 యేళ్లపాటు చెల్లించా ల్సిన వడ్డీతో కూడిన చెల్లింపులకు వినియోగించ నున్నారు. మొత్తం 189.93 కిలోమీటర్ల మేర ఆరు వరుసలతో కూడిన ఓఆర్ఆర్‌తో పాటు నారా కోడూరు నుంచి గుంటూరు శివారులోని బుడం పాడు వరకు 5.2 కిలోమీటర్ల నాలుగు లైన్ల అనుసంధాన రహదారి (స్పర్ రోడ్డు) >>2

# రాయల సీమకు ఉద్యాన సిరులు

ప్రజల భాగస్వామ్యంతో గ్లోబల్ హార్టికల్చర్ క్లబ్

10 జిల్లాల్లో 21 క్లస్టర్ల ఏర్పాటు



**విజయవాడ,సెప్టెంబరు26,ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్ది, రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్-రైజింగ్ రాయలసీమ' కార్యక్రమాన్ని ప్రజాభాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సంబంధిత జిల్లా కలెక్టర్లతో మంత్రి మాట్లాడారు. శనివారం నుంచి అక్టోబర్ 5 వరకు నిర్వహించే ప్రత్యేక ప్రజా అవగాహన కార్యక్రమాలను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షి ంచాలని, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులకు ప్రాజెక్టు లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. గాంధీ జయంతి, లాల్ బహదూర్ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రాజెక్టు (ఐహెచ్‌డిపి) ప్రారంభం కానుందని మంత్రి తెలిపారు. ప్రధాన కార్యక్రమంతోపాటు 201 క్లస్టర్లలో ఏకకాలంలో మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో ప్రత్యక్ష ప్రసారం, జిల్లా కేంద్రాల్లో ఎల్ఇడి తెరలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లా నుంచి ఎంపిక చేసిన ఒక >>2

## రైల్వే ట్రాక్‌పై హోంగార్డు ఆత్మహత్య

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు 26 (ప్రభాతవార్త):** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పోలీస్ స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై హోంగార్డు నాగార్జున ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన నాగార్జున కొంతకాలంగా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో భాగంగా పోలీస్ శాఖకు సేవలందిస్తున్న ఆయన మృతి చెందడంతో తోటి సిబ్బందిలో విషాదం నెలకొంది. నిడదవోలు పీఎస్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై నాగార్జున మృతదేహాన్ని గుర్తించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిసింది. నాగార్జున మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు, సహచరులను పోలీసులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

27-9Pg6exHMNWJQE.qxd:27-9Pg6exHMNWJQE.qxd 1/1/02 6:41 AM Page 1





## 84 మండలాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం

### వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ విసి డా. కట్టుపల్లి ధనుంజయరావు

**తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 84 మండలాలు, 286 గ్రామాల్లో ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా.కట్టుపల్లి ధనుంజయరావు తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం 1,392 హెక్టార్లలో పంటలు దెబ్బ తిని, 4,598 మంది రైతులకు రూ.28.09 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. వరద నీరు తగ్గిన వెంటనే తోట ల్లో నీరు నిల్వ లేకుండా కాలువలు ఏర్పాటు చేయాలని సూచించారు. గాలులకు పడిపోయిన అరటి, మామిడి, ఆయిల్‌పామ్ మొక్కలను నిలబెట్టి ఊతం ఇవ్వాల న్నారు. విరిగిన కొమ్మలను తొలగించి కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు పూయా లని సూచించారు. బొప్పాయి, కొబ్బరి, కోకో, కూరగాయలు, మిరప తోటల్లో పంట నష్టాన్ని బట్టి తగిన యాజమాన్య చర్యలు చేపట్టాలన్నారు. తీవ్రంగా దెబ్బతిన్న కూరగాయలు, మిరప తోటలను తొలగించి రబీ పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, సాం కేతిక సహాయం కోసం విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖాధికారులు అందుబాటులో ఉంటారని ఉపకులపతి తెలిపారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన

## 29న మానసిక ఆరోగ్యం పై అవగాహన సదస్సులు

### జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన వెల్లడి

**అనంతపురం, సెప్టెంబరు 26,ప్రభాతవార్త బ్యూరో:**చదువుకునే విద్యా ర్థులలో నెలకొనే మానసిక సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 29న అనంతపురం లోని కె.ఎస్.ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోనూ, అనంతపురం రూరల్ ప్రాంతంలోని రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన తెలియజేశారు. శనివారం అనంతపురం నగరం సంగమేస్ నగర్‌లోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధాన వక్త సెహర్ హష్మీ నాయకత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం ఈ సదస్సులలో పాల్గొంటున్నట్లు ఆమె తెలియ జేశారు.మానసిక సమస్యలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో వీరు బియాండ్ ది హురైజన్:ఎ రైడ్ ఫర్ రెసిలియెన్స్ పేరుతో గత నెల 18న ఢిల్లీలో ప్రారంభమైన ఈ జాత 12 రాష్ట్రాలు మీదుగా పయనించి అనేక ప్రాంతాలలో విద్యార్థులను కలుసుకొని వారికి మానసిక సమస్యల వల్ల ఎదురయ్యే ఇబ్బం దులను గురించి అవగాహన కల్పిస్తూ బెంగళూరు మీదుగా ఈనెల 28న అనంతపురంనకు చేరుకుంటుందని,అనంతరం 29న జరిగే సదస్సులలో పాల్గొంటారని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఎ.రాజమోహన్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వీరరాజు,నగర ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్'

### మదనపల్లిలో కేంద్ర మంత్రులతో కలిసి ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు: కలెక్టర్ ఓ.ఆనంద్ వెల్లడి



**అనంతపురం, సెప్టెంబరు 26 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం కలెక్టరేట్ లో శనివారం "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్" అంశంపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుపుకొని, రాయల సీమలో "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్" తో హార్టికల్చర్‌ని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడానికి ఒక ఉద్యమం ప్రారంభిస్తున్నారని తెలిపారు. అక్టోబర్ రెండవ తేదీ మదనపల్లెలో దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ , కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి ప్రారంభిస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారుగా 10 జిల్లాల్లో ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్ ప్రాజెక్ట్ కింద లబ్ధి పొందడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిలో భాగంగా రాబోయే 3 సంవత్సరాలలో సుమారుగా లక్ష కోట్ల రూపాయలకు సంబంధించిన ఇన్వెస్ట్మెంట్లు ప్రకాశం, మార్కాపురంతో పాటు రాయలసీమ జిల్లాల్లో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పరిధిలోకి తీసుకొచ్చారని, ఈ జిల్లాల్లో హార్టికల్చర్ క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నారన్నారు. దీనిలో గవర్నమెంట్ కి సంబంధించిన పెట్టుబడులు, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన పెట్టుబడులు కూడా ఉన్నాయన్నారు. మొత్తం ఒక లక్ష కోట్ల పెట్టుబడిలో ప్రభుత్వ పెట్టుబడి 40,000 కోట్ల రూపాయలు కాగా, అందులో ఉద్యానవన రంగం కింద హార్టికల్చర్ కి సంబంధించిన పనులు చేయించుకోవడానికి 14,906 కోట్లు, నీటిపారుదల మౌలిక సదుపాయాల కోసం (హెచ్ఎన్ఎస్ఎస్ కావచ్చు, కెనాల్ నెట్వర్క్, మోడర్నైజేషన్స్, డ్రిప్ ఇరిగేషన్) ఇరిగేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కి 20,844 కోట్లు, గ్రామీణ స్థాయి నుండి రోడ్లని బాగు చేయాలనే ఉద్దేశంతో రూరల్ రోడ్ డెవలప్‌మెంట్ వర్క్స్ కూడా సుమారుగా 4,562 కోట్ల రూపాయలు కేటాయించడం జరుగుతుందని, అన్నీ కలుపుకుంటే 40 వేల కోట్లు ప్రభుత్వ తరఫు నుంచి (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) సీఎం ఆదేశాల మేరకు ఈ యొక్క ఖీగ్లోబల్ హార్టికల్చర్ హబ్ఖీ అని ఒక ప్రాజెక్ట్ ప్రిపేర్ చేయడం జరిగిందని, దాన్ని అక్టోబర్ 2వ తేదీన ప్రారంభిస్తారన్నారు.

## మెడికల్ కాలేజీ ఏమైంది?: మంత్రిని ప్రశ్నించిన విద్యార్థిని



**అనంతపురం, సెప్టెంబరు 26,ప్రభాతవార్త బ్యూరో:**సాధారణంగా మెజారిటీ ప్రజాప్రతి నిధులు తమను ఎవరైనా ప్రశ్నిస్తే తట్టుకో లేరు. అయితే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఏమైనా ప్రశ్నిం చవచ్చని విద్యార్థినులకు చెప్పడం వాళ్లు కూడా ప్రశ్నల వర్షం కురిపిం చడం, మంత్రి కూడా ఓర్పుగా సమాధానం ఇవ్వడం చర్చనీ యాంశమైంది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ధర్మవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమం మంత్రివిద్యార్థినుల మధ్య సాగిన ముఖాముఖితో ప్రత్యేకంగా నిలిచింది. మీరు భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారు అని మంత్రి ప్రశ్నించగా కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, టీచర్ అవుతామని చెప్పారు. ఏడో తరగతి చదువుతున్న నందిని నేను మంత్రి అవుతాను అని చెప్పింది. దీంతో మంత్రి ఆమెను దగ్గరకు పిలిచి. మంత్రి అయ్యి ఏం చేస్తావు? అని అడిగారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తానని నందిని చెప్పింది. అలాగే 9వ తరగతి విద్యార్థిని వెంకటరమణమ్మ నేరుగా మంత్రి వద్దకు వచ్చి ధర్మవరానికి మెడికల్ కాలేజీ తీసుకొస్తానని చెప్పారు అది ఏమైంది? అని ప్రశ్నించింది. వెంటనే స్పందించిన మంత్రి ధర్మవరానికి ఆయుర్వేద వైద్య కళాశాల ఇప్పటికే మంజూరైందని తెలిపారు. మరో విద్యార్థిని ధర్మవరంలోని చేనేత కార్మికుల గురించి ప్రశ్నించగా దీనికి మంత్రి స్పం దిస్తూ ఎన్నికల సమయంలో చేనేత కార్మికుల కోసం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ తీసుకొస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చామని తెలిపారు. మా స్కూల్లో 552 మంది విద్యార్థినులం ఉన్నాం. మాకు 15 నిమిషాల బ్రేక్ ఉంటుంది. ఆ సమ యంలో వాష్‌రూమ్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. మరుగుదొడ్ల సంఖ్యపెంచాలి అని సాహితి అనే విద్యార్థిని కోరగా మంత్రి స్పందించారు.

# భక్తుల నిరీక్షణ సమయంలో ఆధ్యాత్మిక అనుభూతి

## వైకుంఠంలో త్రీడి స్క్రీన్ల ఏర్పాటు దిశగా కార్యాచరణ: ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారి విశేషాలు



**తిరుమల,సెప్టెంబరు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠం నుండి కలియుగంలోకి అడుగుపెట్టిన అద్భుత దృశ్యాన్ని భక్తులకు కళ్ళకు కట్టి నట్లు చూపించే ఎక్స్‌పీరియన్స్ సెంటర్ తిరుమలలో వైకుం ఠమ్ 1 క్యూకాంప్లెక్స్ 17వ కంపార్టుమెంట్‌లో అందుబాటులో ఉంది. తమ కష్టాలు తీరితే నీ దర్శనా నికి వస్తామని, ముడుపుకట్టి మొక్కుకున్న భక్తుల నుండి ప్రముఖుల వరకు ఆ దేవదేవుని దర్శనం కోసం పరితపి స్తుంటారు. ఇలా వచ్చిన భక్తులకు ఆలయంలోనికి చేరుకునే నిరీక్షణ సమయాన్ని మరింత ఆధ్యాత్మికంగా, జ్ఞానదాయకంగా మార్చేందుకు టిటిడి ఆధునిక సాం కేతిక పరిజ్ఞానాన్ని వినియోగించింది. భక్తుల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందించేలా టిటిడి ఇంకో వినూత్న నూతన ఆవిష్కరణకు కార్యాచరణ రూపొందిస్తోంది. వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో త్వరలోనే త్రీడి స్క్రీన్లు ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భక్తులకు కూడా త్రీడి కళ్ళఅద్దాలను అందజేసి ప్రత్యేక అనుభూతి వీక్షించేలా చూడనున్నారు. క్యూలైన్లో వెళ్ళే భక్తులకు మూడువైపులా స్క్రీన్లు ఏర్పాటుచేసి పూర్వం తిరుమలక్షేత్రం నుండి ఇప్పటివరకు పరిణామక్రమం చూపించనున్నారు. ఇప్పటికే వైకుంఠమ్ 1లో 17వ కంపార్టుమెంట్‌లో హీలింగ్ డెవోషనల్ సెంటర్ (భక్తుల అనుభవ కేంద్రం)ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం పని తీరు, ఇందులో శ్రీనివాసుడు తిరుమలపై అడుగుపెట్టిన అద్భుత దృశ్యాలు వీక్షించే విడి ఏర్పాటుచేసినట్లు టిటిడి అదనపు ఇఒ సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. ఈ హీలింగ్ డెవోషనల్ సెంటర్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సెప్టెంబర్ 16న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా తిరు మలలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభమయ్యా యని, వాటిలో భాగంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 17వ కంపార్ట్‌మెంట్‌లో పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

**భక్తుల నిరీక్షణ సమయం జ్ఞానదాయకంగా:** భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయం ఒక నిరీక్షణగా కాకుండా, ఆధ్యాత్మికతను పెంపొందించుకునే, జ్ఞానాన్ని పొందే సమయంగా మార్చాలన్నదే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఇప్పటికే దుర్లభ్ దర్శనం సంస్థ ఆధ్వర్యంలో వర్చువల్ రియాలిటీకి సంబంధించిన కంటెంట్‌ను రూపొందిం చారని, భారీ స్థాయిలో భక్తులను ఆకట్టుకునేలా ఈ సాంకేతికతను ఎలా వినియోగించాలన్న అంశంపై మరింతగా కృషి జరుగుతోందని చెప్పారు.

**కంటెంట్ కోసం ప్రత్యేక వ్యవస్థ:**ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో నిరంతరం కొత్త కంటెంట్ అందుబాటులో ఉండేలా ఒక ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని అదనపు ఇఒ తెలిపారు. పురాణాలు, వేంకటేశ్వరస్వామి వైభవం, స్వామివారి సేవలు, భక్తుల కథలు, ఆలయ నిర్మాణం, చరిత్ర, పరిపాలన, దాతల సేవలు తదితర అంశాలపై విభిన్న కథనాలను రూపొందించి క్రమం తప్పకుండా ప్రసారం చేసే విధంగా చర్యలు తీసుకుంటా మని చెప్పారు. మ్యూజియం నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ప్రత్యేక మాన్యువల్‌ను రూపొందిస్తున్నామని, ఇందులో సిసి కెమెరాల ఏర్పాటు, సిబ్బంది నియామ కం, గైడ్ల సేవలు, భద్రతా చర్యలు, కళాఖండాల ప్రత్యేక నంబరింగ్ తదితర అంశాలను పొందుపరుస్తున్నట్లు తెలిపారు. తిరుమలను మరింత ప్రత్యేకమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఇటువంటి ప్రాజెక్టులు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ముఖ్యంగా తెలుగు కంటెంట్‌ను మరింతగా పెంచడం, కంటెంట్‌ను క్రమం తప్పకుండా మార్చడం, విభిన్న అంశాలను అందించడం తదితర సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇఒ సోమన్నా రాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల వర్షాలతో జలశయాల్లో స్వల్పంగా పెరిగిన నీటి నిల్వలు

**విజయవాడ,సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలు కర వు పరిస్థితుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కొంత ఊర టనిచ్చాయి. అయితే ఇరిగేషన్‌శాఖాధికారుల సమాచారాన్ని అనుసరించి ఈ వర్షాల ప్రయో జనం రాష్ట్రవ్యాప్తంగా సమాంతరంగా లేదు. ఉత్తరాంధ్ర, గోదావరి పరివాహకం, నెల్లూరు–పెన్నా ప్రాంతాల్లో ప్రవాహాలు గణనీయంగా పెరగగా, రాయలసీమలోని అనేక జలాశయాలకు ఇంకా పెద్దగా స్థానిక ప్రవాహాలు చేరలేదు. ఏలేరుకు వర్షాలతో భారీ స్థానిక ప్రవాహం చేరింది.సెప్టెంబర్ 21న ఏలేరుకు మొత్తం ఇన్‌ఫ్లో 1,400 క్యూసెక్కులు మాత్రమే ఉండగా, 25న అది 18,651 క్యూసెక్కులకు పెరిగింది. ఇం దులో 17,251 క్యూసెక్కులు స్థానిక క్యాచ్‌మెంట్ నుంచే వచ్చినట్లు నివేదిక పేర్కొంది. నిల్వ 10.87 నుంచి 13.04 టీఎంసీలకు పెరిగింది అంటే సుమారు 2.17 టీఎంసీల అదనపు నిల్వ పెరిగింది, వంశధార గొట్టా వద్ద వరద ప్రవాహం చేరింది.గొట్టా బ్యారేజ్ వద్ద సెప్టెంబర్ 21న ఇన్‌ఫ్లో 7,214 క్యూసెక్కులు ఉండగా, 25న 30,734 క్యూసెక్కులకు పెరిగింది నాలుగు రెట్లకు పైగా. 25న స్పిల్‌వే విడుదల 31,638 క్యూసెక్కులు నమోదైంది.హిరమండలం నిల్వకు ప్రయోజనం కలిగింది.ఈ నెల21న హిరమం డలానికి ఇన్‌ఫ్లో కేవలం 36 క్యూసెక్కులు, నిల్వ 3.67 టీఎంసీలు. 25న ఇన్‌ఫ్లో 4,365 క్యూసె క్కులకు పెరగడంతో నిల్వ 4.40 టీఎంసీలకు చేరింది. అంటే సుమారు 0.73 టీఎంసీల పెరు గుదల కన్పించింది. రాష్ట్ర రోజువారీ వర్షపాతం సెప్టెంబర్ 25న 9.64 మి.మీ. గా నమోదైనా, రాయలసీమలో అది కేవలం 1.71 మి.మీ. మా త్రమే, కోస్తాంధ్రలో 18.16 మి.మీ. నమోదైంది. ఈ ప్రాంతీయ వ్యత్యాసమే జలాశయాలల్లోను కనిపిస్తోంది.

మూడు రోజుల వర్షాలు ఏపీ జలా శయాలన్నింటినీ నింపేశాయని చెప్పలేనప్పటికి నిల్వపరిస్థితులు మెరుగుపడ్డాయని అధికారులు తెలిపారు. దీర్ఘకాల వర్షాభావ పరిస్థితుల్లో ఉత్త రాంధ్ర నుంచి నెల్లూరు వరకు కొన్ని కీలక జల వనరులకు వచ్చిన ఈ ప్రవాహాలు మాత్రం విలువైన ఊరట కలిగించాయన్నారు.

## స్థానిక ఎన్నికల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యం

### మంత్రి కొలుసు పార్థసారథి



**విజయవాడ,సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** సార్వ త్రిక ఎన్నికల్లో సాధించిన 94శాతం ఫలితాల కంటే మెరుగైన ఫలితాలను లోకల్‌బాడీ ఎలక్షనుల్లో సా ధించడమే కూటమి లక్ష్యమని ఏపీ సమాచార శాఖా మంత్రి కొలసు పార్ద సారధి వ్యాఖ్యానించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో పోలిస్తే తమ రెండేళ్ల ప్రభుత్వంలో అపూర్వమైన అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. శనివారం విజయవాడలో మంత్రి కొలుసు పార్థసా రథి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తమ సర్కారులో ఉద్యోగ అవకాశాలను, సంక్షే మాన్ని అందించామని అన్నారు. వైసీపీ హయాంలో నిరక్ష్యం చేసిన పోలవరం, వెలిగొండ వంటి నీటిపారుదల ప్రాజెక్టులను బాధ్యతాయుతంగా పూర్తి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలిసి విజయమే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. కూటమిలోని మూడు పార్టీల మధ్య చిన్న చిన్న విభేదాలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించేలా నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశా మని అన్నారు. బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా, ఆ జిల్లాలోని అన్ని నియో జకవర్గాల్లో వందశాతం ఉత్తమ ఫలి తాలు సాధించేందుకు మూడు పార్టీల నాయకులను, కార్యకర్తలను కలుపు కొని ముందుకెళ్తామని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

# 30న విజయవాడలో పేదలకు పట్టాభిషేకం

## ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం



**అమరావతి,సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** పేదలకు పట్టాభిషేకంలో భాగంగా మరో ప్రతిష్ఠా త్మక కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈనెల 30న విజయవాడలో 24,057 మంది లబ్ధిదారులకు ఇళ్ల క్రమబద్ధీక రణ పట్టాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అం దించనున్నారు. దశాబ్దాల క్రితం ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరణ పట్టాలు పంపిణీ చేయనున్నారు. ప్రతి ఎన్నికలోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే విశాఖలో పండుగ వాతావరణంలో రూ.8874 కోట్ల విలువైన భూమిపై 28,445 కుటుంబాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు సీఎం అందించిన విషయం తెలిసిందే. ఇప్పుడు విజయవాడలో రూ.9800 కోట్ల విలువైన భూమిపై 24,057 కుటుంబాలకు రెగ్యులరైజేషన్ పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఒక్కో కుటుంబానికి రమారమి రూ.4045 లక్షలకు వరకు లబ్ధి చేకూర్చేలా క్రమబద్ధీకరణ పట్టాలను ఇవ్వనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, కృష్ణా జిల్లా పరిధిలోని గన్నవరం నియోజవర్గం పరిధిలోని మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో సంపూర్ణ హక్కులతో ఈ పట్టలను అందజేస్తారు. విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమం, విజయవాడ సెంట్రల్, గన్నవరం, జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ, తిరువూరు నియోజక వర్గాల్లోని లబ్ధిదారులకు, అలాగే విజయవాడ నగరంలోని 3 నియోజకవర్గాల పరిధిలోని కొండలపై నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలను అందిస్తూ లబ్ధిదారుల కలలను సీఎం చంద్రబాబు సాకారం చేయనున్నారు.క్రమబద్ధీకరణ పట్టాలిస్తే తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా ఉంటుందని దశాబ్దాలుగా కొండ ప్రాంత నివాసితులు డిమాండ్ చేస్తోన్న విషయం విది తమే. ఇటీవల జరిగిన జిల్లా ప్రజా ప్రతినిధుల సమావేశంలోనూ ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్‌పై ఎన్టీఆర్ జిల్లా ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాల కలను నిజం చేస్తూ 617 ఎకరాల్లోని 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై సంపూర్ణ హక్కులను ప్రభుత్వం కల్పించనుంది. పేద, మధ్య తరగతి కుటుం బాలకు సంపూర్ణ హక్కు కల్పిస్తూ రెగ్యులరైజేషన్ పట్టాలిస్తున్న భూముల మార్కెట్ విలువ సుమారు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. సంపూర్ణ హక్కులు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం పంపిణీ చేయబోతోన్న పట్టాల ద్వారా బీసీలు 12093, ఓసీలు 6130, ఎస్సీలు 4546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలకు లబ్ధిచూకూరనుంది . విజయవాడ (తూర్పు) 7990, విజయవాడ (పశ్చిమం) 7465, విజయవాడ (సెంట్రల్) 5815, గన్నవ రం 602,జగ్గయ్యపేట 1135,మైలవరం 981, నందిగామ 54, తిరువూరు 15 మంది లబ్దిదారులకు ప్రయోజనం లభిస్తుంది.

## ఇసిల నియామకంలో పునరాలోచించాలి

### మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

### ఎపిలో సర్ ప్రక్రియ దుర్వినియోగమైంది



**విజయవాడ,సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఎలక్షన్ కమిషనర్ల నియామక ప్రక్రియపై పునరా లోచన చేయాలని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసారు. ప్రధా నమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధా న న్యాయమూర్తి (సీజేఐ) సభ్యులుగా ఉండే కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ (ఈసీఐ) పనితీరుపై ప్రజాస్వామ్యంలో నమ్మకం కలగాలంటే దాని నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో ఓటర్ల జాబితాలు, డేటాబేస్ ప్రాసెస్, ఈసీనెట్ నిర్వహణపై దాదాపు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన కథనాన్ని వైఎస్ జగన్ ప్రస్తావించారు. ఈ పరిణామాలు ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తున్నా యని ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో తీసుకొచ్చిన ఈసీ నియామకాల చట్టానికి గతంలో వైఎస్సార్సీపీ మద్దతు ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆ చట్టాన్ని పునః పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఓటర్ల సవరణ (ఎస ఐఆర్) ప్రక్రియలో అధికార పక్షం తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని వైఎస్ జగన్ ఆరోపిం చారు. ప్రతిపక్షంగా తమ విజ్ఞప్తులను, స్థానిక సంస్థల ఎన్నికలడివిజన్ల పునర్విభజనపై వ్యక్తం చేసిన అభ్యంతరాలను అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు ప్రజా స్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని అన్నారు.

# పోలీసులంటే ప్రజలకు భరోసా కల్పించాలి

## దీక్షాంత్ పెరేడ్‌లో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత



**సిద్దవటం సెప్టెంబరు 26ప్రభాతవార్త :** పోలీసులంటే ప్రజలకు భరోసా కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత నూతన పోలీసు కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. మండలంలోని బాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసు పరేడ్ మైదానంలో శనివారం 521 మంది నూతనంగా శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి మంత్రి సవిత హాజరుకాగా, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గౌరవ అతిథులుగా పాల్గొనగా కమాండెంట్ ఆనంద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. ఈ దీక్షాంత్ పరేడ్‌లో శిక్షణను పూర్తి చేసుకున్న 521 మంది కానిస్టేబుళ్లు ఈ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో కడప పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 194 మంది సివిల్ ఎస్‌సీటీపీసీలు, 11వ బెటాలియన్‌కు చెందిన 327 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని అన్నారు. దీక్షాంత్ పరేడ్ కేవలం ఒక పరేడ్ మాత్రమే కాదని శిక్షణార్థి నుంచి బాధ్యతాయుతమైన పోలీసు సిబ్బందిగా మారే కీలక ఘట్టమన్నారు. సుమారు 6 వేల మంది కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో అనేక అడ్డంకులను అధిగమించి నియామకాలు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు ఇచ్చే నెలవారీ స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణా కేంద్రాల్లో సుమారు 5,800 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ మీరు చేసే ప్రతి పని పోలీసు శాఖ ప్రతిష్ఠతో ముడిపడి ఉంటుంది. ప్రజలతో మర్యాదగా, నిష్పక్షపాతంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరిం చాలన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ 9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని పోలీసు విధుల్లోకి అడుగుపెడుతున్న నూతన కానిస్టేబుళ్ల శిక్షణలో నేర్చుకున్న క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దారుఢ్యం, విధి నిర్వహణ నైపుణ్యాలను సేవలో కొనసాగిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద రెడ్డి, కడప డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, పోలీసు అధికారులు, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చమర్తి జగన్మోహన్ రాజు, టిడిపి కడప జిల్లా అధ్యక్షులు పార్లమెంటు ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి ఏపీ పంచాయతీ రాజ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నత అధికారులు, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కల్యాణి హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

**విజయవాడ,సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడ నగరంలో సం చలనం సృష్టించిన కల్యాణి హత్య కేసును పోలీసులు ఛేదించారు. పోలీసుల దర్యాప్తులో మటన్ షాప్ యజమాని షఫీ ఈ హత్యకు పాల్పడినట్లు నిర్ధారణ అయినట్టు సమాచారం. కొంతకాలంగా కల్యాణితో షఫీ సన్నిహితంగా ఉం టున్నాడని, డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య వివాదాలు తలెత్తినట్లు పోలీ సులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ నెల 17న కల్యాణిని భవానీపురంలోని తన ఇంటికి షఫీ తీసుకెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అక్కడ డబ్బుల విషయమై ఇద్దరి మధ్య గొడవ జరగడంతో, షఫీ కత్తితో కల్యాణి గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించినట్టు సమాచారం. హత్య అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి, తన మటన్ షాపులో పనిచేసే గురువులు అనే వ్యక్తి సహాయంతో వాటిని తరలించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహం భాగాలను విజయవాడలోని గొల్లపూడి ప్రాంతంలోని కూలింగ్ కెనాల్‌లో పడేసినట్లు దర్యాప్తులో తేలినట్టు పోలీసులు వెల్లడించారు. కేసులో షఫీతో పాటు అతడికి సహకరించిన గురువులను పోలీ సులు అరెస్ట్ చేశారు. హత్యకు దారితీసిన పూర్తి కారణాలు, నిందితుల పాత్ర, మృతదేహాన్ని తరలించిన విధానం తదితర అంశాలపై పోలీసులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రోడ్డుమీద కనిపించే ప్రభుత్వ ప్రతినిధి మీరే: మంత్రి పయ్యావుల



శిక్షణ పొందిన పోలీసులకు సర్టిఫికెట్లు బహూకరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్. చిత్రంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్

**అనంతపురం, సెప్టెంబరు 26,ప్రభాతవార్త బ్యూరో:** ప్రజా సమస్యలపై పోలీసులు చట్టబద్ధంగా నిష్ప క్షపాతంగా వ్యవహరించాలని, రోడ్డుమీద కని పించే ప్రభుత్వ ప్రతినిధి మీరేనని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహా రాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అభిప్రా యపడ్డారు. శనివారం అనంతపురం జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన పాసిం గ్ అవుట్ పెరేడ్‌లో 2025–26 బ్యాచ్ ఎస్‌సి టిపిసి (సివిల్) బ్యాచ్ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ ఖాకీ యూనిఫార్మ్ అధికారంతో పాటు బాధ్యతను ఇచ్చిందని శిక్షణార్థులందరూ తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. అన్ని ఉద్యోగాలకు వేళలు ఉంటాయని పోలీసులకు నిరంతరం బాధ్యత మాత్రమే ఉంటుందన్నారు. ప్రమాదాలకు ఎదురు వెళ్లి విధులు నిర్వహిం చేవారు పోలీసులు అన్నారు. ప్రస్తుత సమాజం లో టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని నేరస్తులు మిమ్మల్ని చూసి భయపడేలా పనిచే యాలన్నారు. పోలీస్‌లు నిరంతరం అప్డేట్ అవుతూ మానవత్వంతో బాధ్యతతో పనిచేసి మి మ్మల్ని ఈ స్థాయికి తీసుకురావడానికి కష్టపడిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాల న్నారు. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు న్యాయం అందించే విధంగా విధులు నిర్వహిం చాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఇండోర్, అవుట్ డోర్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు మెమెం టోలు, ప్రశంసా పత్రాలు అం దజేశారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా ఎస్పీ జగదీష్ ,పిటిసి ప్రిన్సిపల్ సుప్రజ, ట్రైనింగ్ ఆర్ఐలు, ట్రైనింగ్ ఆర్ఎస్ ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, వీఐపీలు, పోలీసు అధికా రులు మరియు సిబ్బంది, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు, అసోసి యేషన్ ప్రెసిడెంట్ తలారి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



## హైవే అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆగ్రహం

### ఉండ్రాజవరం జంక్షన్‌లో ధ్వంసమైన సర్వీస్ రోడ్లపై తీవ్ర అసంతృప్తి

**తణుకు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:**హైవే నిర్వహణ అధికారుల తీరుపై తణు కు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్లు ధ్వంసమై గుంతలు ఏర్పడి వాహన దారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సంబంధిత హైవే అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి రహదారుల దుస్థితిపై ప్రశ్నించారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకపోవడం సరికా దన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తూతూమంత్రంగా పనులు చేపట్టడం వల్లే రోడ్లు కొద్దికాలానికే ధ్వంసమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతతో శాశ్వత మర మ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

27-9Pg5.qxd:27-9Pg5.qxd 1/1/02 6:07 AM Page 1



# భారీగా క్షీణించిన ట్రంప్ ప్రతిష్ట

## - 36 యేళ్లలో అత్యల్ప ప్రజాదరణ - కేవలం 37 శాతం మంది మాత్రమే మద్దతు

**వాషింగ్టన్,సెప్టెంబరు 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రజాదరణ గణనీయంగా పడిపోయింది. వాల్ స్ట్రీట్ జర్నల్ సర్వేలో ట్రంప్‌కు కేవలం 37 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు. 61 శాతం మంది ఆయన పనితీరును తిరస్కరించారు. 1990 నుంచి నిర్వహిస్తున్న ఈ పోలింగ్ గణాంకాల ప్రకారం మధ్యంతర ఎన్నికలకు ముందు ఏ అధ్యక్షుడికైనా నమోదైన అత్యల్ప ఆమోద రేటు ఇదేనని ఒక జర్నల్ పేర్కొంది. అమెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ట్రంప్ ప్రజాదరణలో భారీ క్షీణత కనిపించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ ప్రజాదరణ తగ్గడానికి ప్రధాన కారణాల్లో ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, పెరుగుతున్న ఇంధన ధరలు ఉన్నట్లు తాజా సర్వేలు సూచిస్తున్నాయి. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించాయి. రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో ట్రంప్ ధరలను నియంత్రిస్తానని, అనవసరమైన యుద్ధాలకు దూరంగా ఉంటానని హామీ ఇచ్చారు. అయితే ఏడు నెలలు గడిచినా యుద్ధానికి ముగింపు కనిపించకపోవడంతో పాటు ఇంధన ధరలు కూడా పెరిగాయి. మరో అంతర్జాతీయ సర్వేలోనూ ట్రంప్ ప్రజాదరణ క్రమంగా తగ్గుతున్నట్లు వెల్లడైంది. రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో ఆయనకు 47 శాతం ఆమోదం ఉండగా మార్చి మధ్య నాటికి అది 40 శాతానికి, యుద్ధం ప్రారంభమైన మూడు వారాల తర్వాత 36 శాతానికి పడిపోయింది. ఆగస్టు మధ్య నాటికి 33 శాతానికి, ఈనెల 21న 32 శాతానికి చేరింది. ఇది ఆయన రాజకీయ జీవితంలోనే అత్యల్ప స్థాయి అని ఈసర్వే తెలిపింది. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు ప్రజల మద్దతు కూడా తగ్గుతోంది. మార్చిలో 37 శాతం మంది సైనిక చర్యకు మద్దతు ఇవ్వగా, ఆగస్టు చివరి నాటికి అది 31 శాతానికి పడిపోయింది. మరోవైపు, 83 శాతం మంది ఈ యుద్ధం ఇంకా కొనసాగుతుందని భావిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. ట్రంప్‌కు మరో ప్రధాన సమస్య జీవన వ్యయం. మార్చిలో జీవన వ్యయాన్ని ట్రంప్ ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుపై 25 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నాటికి ఈ సంఖ్య 17 శాతానికి పడిపోయింది. తమ పార్టీ కాంగ్రెస్‌పై ఆధిపత్యాన్ని కొనసాగిస్తే ప్రతి ఓటరుకు 5,000 డాలర్ల డివిడెండ్ అందించే ప్రతిపాదనను కూడా ఆయన ప్రస్తావించారు. ట్రంప్ పాలనకు ఇప్పుడు డెమొక్రాట్లు, స్వతంత్ర ఓటర్ల నుంచి మాత్రమే కాకుండా సొంత పార్టీ రిపబ్లికన్ల నుంచి కూడా వ్యతిరేకత పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. సర్వే ప్రకారం సెప్టెంబర్‌లో ఒక్క వారంలోనే రిపబ్లికన్లలో ట్రంప్ ఆమోదం 82 శాతం నుంచి 73 శాతానికి పడిపోయింది. తొలిసారిగా ఈ పదవీకాలంలో ట్రంప్ జీవన వ్యయంపై ఆయన పనితీరును వ్యతిరేకిస్తున్న రిపబ్లికన్ల సంఖ్య (51 శాతం) మద్దతు ఇస్తున్న వారి సంఖ్య (44 శాతం) కంటే ఎక్కువైంది. అయితే ట్రంప్ ఆమోద రేటుపై అన్ని సర్వేలు ఒకే అంచనాను ఇవ్వడం లేదు. అమెరికన్ రీసెర్చ్ గ్రూప్ సర్వేలో ఆయన ఆమోదం 29 శాతంగా ఉండగా, సెప్టెంబర్ ప్రారంభంలో హార్వర్డ్ క్యాప్స్/హారిస్ నిర్వహించిన సర్వేలో నమోదైన ఆమోదం 44 శాతంగా ఉంది. సిల్వర్ బులెటిన్ సగటు అంచనా 37.6 శాతం, ఫిఫ్టీ ప్లస్ వన్ సగటు 34.6 శాతంగా ఉంది. సర్వే పద్ధతులు, నమూనాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ ట్రంప్ ప్రజాదరణ తగ్గుతున్న దిశ మాత్రం స్పష్టంగా కనిపిస్తోందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో జరిగిన మధ్యంతర ఎన్నికల సదస్సులో ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశించి నేను బ్యాలెట్‌పై ఉన్నానని ఊహించుకోండని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటర్లు నిజంగానే మధ్యంతర ఎన్నికలను ట్రంప్ పాలనపై ప్రజాభిప్రాయ పరీక్షగా చూస్తున్నారా అన్నది కీలకంగా మారింది. తక్కువ ఆమోద రేటు తప్పనిసరిగా భారీ ఎన్నికల పరాజయానికి దారితీస్తుందని చెప్పలేం. మధ్యంతర ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో పోటీ పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయి. 2022 మధ్యంతర ఎన్నికలకు ముందు జో బైడెన్ ఆమోద రేటు గ్యాలప్ సర్వేలో 40 శాతంగా ఉన్నప్పటికీ, డెమొక్రాట్లు ప్రతినిధుల సభలో కేవలం తొమ్మిది స్థానాలను మాత్రమే కోల్పోయారు. గ్యాలప్ 1946 నుంచి సేకరించిన గణాంకాల ప్రకారం, అధ్యక్షుడి ఆమోద రేటు 50 శాతం కంటే తక్కువగా ఉన్న సందర్భాల్లో ఆయన పార్టీ ప్రతినిధుల సభలో సగటున 37 స్థానాలను కోల్పోయింది. ట్రంప్ ప్రస్తుత ఆమోద రేటు, ఇరాన్ యుద్ధంపై ప్రజల అభిప్రాయం, జీవన వ్యయం మరియు ఇంధన ధరలపై అసంతృప్తి నవంబర్ మధ్యంతర ఎన్నికలకు ముందు అమెరికా రాజకీయాల్లో కీలక అంశాలుగా మారుతున్నాయి.

# ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారు

### డీఎంకె మాజీ సీఎం స్టాలిన్ సెటైర్లు

**చెన్నై,సెప్టెంబరు 26:** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకె అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండి పడ్డారు. జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశం చినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

# అణ్వాయుధాల తయారీ దిశగా సౌదీ అరేబియా



### అమెరికా నిఘా వర్గాల అంచనా

**వాషింగ్టన్, సెప్టెంబరు 26:** అణ్వాయుధ తయారీలో పశ్చిమాసియా దేశాల మధ్య పోటీపై మళ్లీ చర్చ మొదలైంది. సౌదీ అరేబియా అణ్వాయుధాల తయారీ దిశగా వెళ్లే అవకాశాన్ని కొట్టిపారేయలేమని యుఎస్ నిఘా వర్గాలు అంచనా వేశాయి. అణుబాంబులు తయారుచేసేందుకు ఆ దేశం ఆసక్తి చూపించొచ్చని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు అగ్రరాజ్య కాంగ్రెస్‌కు అందించిన తమ రహస్య నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. పౌర అవసరాల కోసం సౌదీ అరేబియాకు యురేనియం ఇచ్చేందుకు.. ఆ దేశంతో 30 యేళ్ల సుదీర్ఘకాల ఒప్పందానికి ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందంపై అమెరికా చట్టసభ సభ్యుల్లో కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. సౌదీకి యురేనియం శుద్ధి సాంకేతికతను అందిస్తే.. భవిష్యత్తులో అణ్వాయుధాల తయారీకి అవసరమైన సామర్థ్యం వారికి అందుబాటులోకి వస్తుందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒప్పందం ప్రకారం సౌదీకి 5 శాతం లోపు మాత్రమే యూరేనియం శుద్ధికి పరిమితులు ఉన్నాయి. భవిష్యత్తులో దీనిని 20 శాతానికి పెంచే అవకాశంపై చర్చ జరుగుతోంది. అయితే అణ్వాయుధాల తయారీకి సాధారణంగా 60-90 శాతం వరకు శుద్ధి చేసిన యురేనియం అవసరమవుతుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ అణుబాంబులను తయారుచేస్తే.. భద్రతా కారణాల దృష్ట్యా తాము కూడా అణ్వాయుధాలను సమకూర్చుకోవాల్సి వస్తుందని సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గతంలో హెచ్చరించడం గమనార్హం.

# వీసా ఫీజుపెంపుపై 22 రాష్ట్రాలు వ్యతిరేకం

## ఒక్కటయిన అటార్నీ జనరల్స్

**వాషింగ్టన్, సెప్టెంబరు 26:** అమెరికాలో కొన్ని రకాల హెచ్1బీ వీసా పిటిషన్లపై లక్ష డాలర్ల (సుమారు రూ. 95 లక్షలు) ఫీజు విధించాలని ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం చట్టవిరుద్ధమని, దేశంలో ఇప్పటికే ఉన్న ఉపాధ్యాయులు, వైద్యులు, నర్సుల కొరతను ఇది మరింత తీవ్రతరం చేస్తుందని వాదిస్తూ 22 అమెరికా రాష్ట్రాల అటార్నీ జనరల్స్ ఏకమయ్యారు. ఈ మేరకు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్)కు అధికారికంగా లేఖ రాశారు. ఈ ఏడాది ఆగస్టు 25న యూఎస్‌సీఐఎస్ ఈ కొత్త నిబంధన ముసాయిదాను జారీ చేసింది. వార్షిక హెచ్1బీ వీసా పరిమితి నుంచి మినహాయింపు లేని కంపెనీలు దాఖలు చేసే పిటిషన్లపై ఏకంగా 103,265 డాలర్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఈ భారీ మొత్తాన్ని ఫీజుగా కాకుండా ఒక రకమైన పన్నుగా అటార్నీ జనరల్స్ అభివర్ణించారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా కేవలం పరిపాలనాపరమైన చర్యల ద్వారా ఇలాంటి పన్ను విధించే అధికారం ప్రభుత్వానికి లేదని వారు స్పష్టం చేశారు. కాలిఫోర్నియా, న్యూయార్క్, న్యూజెర్సీ, టెక్సాస్ వంటి కీలక రాష్ట్రాలతో పాటు మొత్తం 22 రాష్ట్రాలు ఈ వ్యతిరేక కూటమిలో ఉన్నాయి. హెచ్1బీ వీసా ప్రోగ్రామ్ ద్వారా అమెరికా కంపెనీలు ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన విదేశీ నిపుణులను నియమించుకుంటాయి. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులకు ఈ వీసాలు కీలకం. ఈ కొత్త ప్రతిపాదన అమలైతే, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కోసం విదేశీయులపై ఆధారపడే అమెరికన్ కంపెనీలకు, ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న ప్రభుత్వ సంస్థలకు పెనుభారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రయత్నం జరగడం ఇది మొదటిసారి కాదు. 2025లో అధ్యక్షుడి ఆదేశాల ద్వారా విధించిన లక్ష డాలర్ల ఫీజును, కాంగ్రెస్ అనుమతి లేదన్న కారణంతో 2026 జూన్‌లో ఒక ఫెడరల్ జడ్జి చట్టవిరుద్ధమని కొట్టివేశారు.

# నకిలీ ఆధార్‌ను పట్టే అద్భుతవ్యవస్థ ఆవిర్భావం!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** దేశంలో ఆధార్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా భారత పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. నకిలీ ఆధార్ కార్డులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేందుకు భారత్ ఏబీఐఎస్ అనే సరికొత్త ఓపెన్ సోర్స్ బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. యూఐడీఏఐతో సంబంధం ఉన్న పరిశోధకులు, ఐఐటీ హైదరాబాద్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ నిపుణుల బృందం సంయుక్తంగా ఈ టెక్నాలజీని రూపొందించింది. ఇది దేశవ్యాప్తంగా ఆధార్ డేటాబేస్‌లో డూప్లికేట్ ఎంట్రీలను ఏరివేయడంలో కీలకంగా మారనుంది. భారత్ ఏబీఐఎస్ అనేది వేలిముద్రలు, కనుపాప (ఐరిస్), ముఖ కవళికలను కలిపి బయోమెట్రిక్స్‌ను విశ్లేషించే ఒక మల్టీమోడల్ వ్యవస్థ. ఈ మూడు డేటాలను కలిపి ప్రతి వ్యక్తికి కేవలం 13.5 కెబి పరిమాణంలో ఒక టెంప్లేట్‌ను ఇది సృష్టిస్తుంది. దేశంలోని మొత్తం 155 కోట్ల ఆధార్ ఎంట్రీల నుంచి నమూనాగా సేకరించిన 22 కోట్ల డీఐడెంటిఫైడ్ రికార్డులపై ఈ వ్యవస్థను పరీక్షించారు. ముఖ్యంగా 2 కోట్ల రికార్డుల సబ్‌సెట్‌పై జరిపిన పరీక్షల్లో ఇది అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. తప్పుడు గుర్తింపుల రేటు (ఎఫ్‌పీఐఆర్) కేవలం 0.1 శాతంగా, అసలైన వాటిని గుర్తించడంలో వైఫల్యం రేటు (ఎఫ్ఎన్ఐఆర్) 0.05 శాతంగా నమోదైంది. ఈ ఫలితాలు యూఐడీఏఐ నిర్దేశించిన 0.5 ఎఫ్‌పీఐఆర్, 0.1 ఎఫ్ఎన్ఐఆర్ లక్ష్యాల కన్నా చాలా మెరుగ్గా ఉండటం గమనార్హం. ఎఫ్‌పీఐఆర్, ఈ వ్యవస్థ రూపకల్పనలో ఓపెన్ సోర్స్ భాగాలను వినియోగించడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. డేటా ప్రాసెసింగ్, నాణ్యత అంచనా, ఫేక్ బయోమెట్రిక్స్‌ను గుర్తించడం వంటి పనుల కోసం ఓపెన్ సోర్స్ టూల్స్‌నే వాడారు. భారీ డేటాబేస్‌లో శోధన ప్రక్రియ వేగంగా జరిగేందుకు సర్వర్లపై పనిభారాన్ని సమానంగా పంపిణీ చేసే ఒక ప్రత్యేక షెడ్యూలర్‌ను కూడా ఇందులో పొందుపరిచారు. వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న మూడు ప్రముఖ వ్యవస్థలతో పోల్చినప్పుడు భారత్ ఏబీఐఎస్ వాటికి సమానమైన లేదా అంతకంటే మెరుగైన కచ్చితత్వాన్ని చూపించింది. 8 ఎన్విడియా బీ100 జీపీయూలు, 2 టీబీ ర్యామ్‌తో కూడిన ఒక్క సర్వర్‌పై 4 కోట్ల రికార్డుల గ్యాలరీలో సెకనుకు 100 శోధనలు చేయగల సామర్థ్యం దీనికి ఉంది.

# ఎస్సీ,ఎస్టీ ఎంపీలకు మాట్లాడే సమయం కేటాయించాలి!

### బీహార్ మాజీ సీఎం జతిన్‌రామ్ మాంజీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27:** పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీల గళానికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర మంత్రి, ఎన్డీఏ మిత్రపక్ష నేత జితన్ రామ్ మాంజీ ఒక లేఖ రాశారు. పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన బిల్లులపై చర్చ జరిగే తరుణంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలకు సభలో మాట్లాడేందుకు మరికొంత అదనపు సమయం కేటాయించాలని ఆయన ఆ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఎన్డీఏ ఎంపీలతో నిర్వహించిన ఒక సమావేశంలో ఈ ప్రధానాంశం చర్చకు వచ్చినట్లు మాంజీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ ఈ ప్రస్తావన తెచ్చారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి చెందిన ప్రత్యేక సమస్యలు, అంశాలను సభలో వివరంగా ప్రస్తావించేందుకు ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు తగినంత సమయం అవసరమని పటేల్ కోరినట్లు మాంజీ తన లేఖలో ప్రస్తావించారు. ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ చేసిన ఈ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌ను కోరారు. మరోవైపు, సభలో తమకు అసలు సమయమే కేటాయించడం లేదని తాము అనడం లేదని.. తమ వర్గాల సమస్యలపై మరింత లోతుగా చర్చించేందుకు కేటాయించిన సమయాన్ని మరింత పెంచాలని మాత్రమే కోరుతున్నట్లు ఎంపీ పటేల్ గతంలో ఒక మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

# నాగాలాండ్‌లో కల్తీమద్యం సేవించి 19 మంది మృతి

**కోహిమా, సెప్టెంబరు 26:** నాగాలాండ్‌లో కల్తీ మద్యం అనుమానిత ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లో మద్యం సేవించిన తర్వాత 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మొకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఐ.బంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఈ బృందం పనిచేయనుంది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది దాని సరఫరా వెనుక ఎవరున్నారు అనే అంశాలను సిట్ దర్యాప్తు చేస్తోంది. మద్యం నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం గువాహటికి పంపించారు. మరణాలకు అసలు కారణం ఏంటో పరీక్షల తర్వాత స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, అయితే దర్యాప్తు ప్రారంభ దశలో ఉన్నందున వివరాలు వెల్లడించలేమని సీనియర్ ఎస్పీ వెసుప్రా కెజో తెలిపారు. మరణాల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 19 మందిని అరెస్టు చేశారు. దాదాపు 3 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని, లేబుల్ లేని లేదా అనుమానిత అక్రమ మద్యాన్ని తాగవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. మద్యం తాగిన తర్వాత తల తిరగడం, చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని హెచ్చరించారు.



# దేశంలో 428.55 కోట్లకుపెరిగిన పర్యాటకులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** భారత పర్యాటక రంగం గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలక చోదకశక్తిగా మారుతోంది. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం జరగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2025 సంవత్సరంలో దేశీయ పర్యాటకుల సంఖ్య ఏకంగా 428.55 కోట్లకు చేరుకోగా, విదేశీ పర్యాటకుల సంఖ్య 2.53 కోట్లకు పెరిగింది. దీని ద్వారా దేశానికి రూ. 2,76,831 కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పర్యాటక రంగం దేశ జీడీపీకి 5.22 వాటాను అందించడంతో పాటు, ప్రత్యక్షంగా, పరోక్షంగా 8.46 కోట్ల మందికి ఉపాధి అవకాశాలను కల్పించిందని ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యాటక రంగం 2024లో గ్లోబల్ జీడీపీలో 10 వాటాను (10.9 ట్రిలియన్ డాలర్లు) కలిగి ఉండటం గమనార్హం. ఈ ఏడాది డిజిటల్ ఎజెండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ థీమ్‌తో పర్యాటక దినోత్సవం జరగనుండగా, ఆ దిశగా భారత్ ఇప్పటికే కీలక అడుగులు వేస్తోంది. ఈవీసా, ఇన్‌క్రెడిబుల్ ఇండియా డిజిటల్ ప్లాట్‌ఫామ్, నిధిప్లస్ వంటి కార్యక్రమాలతో డిజిటల్ టూరిజం వ్యవస్థను బలోపేతం చేస్తోంది. ముఖ్యంగా 2014లో 43 దేశాలతో ప్రారంభమైన ఈవీసా సౌకర్యం ఇప్పుడు 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చింది. దేశంలోని 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు సహా మొత్తం 88 అంతర్జాతీయ పోర్టుల ద్వారా ప్రవేశానికి అనుమతి ఇస్తున్నారు. ప్రస్తుతం భారత్ జారీ చేస్తున్న మొత్తం వీసాలలో 78 ఈవీసాలే ఉండటం, 95 దరఖాస్తులను 72 గంటల్లోనే ప్రాసెస్ చేస్తుండటంతో విదేశీ పర్యాటకులకు ప్రయాణం సులభతరమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్లాట్‌ఫామ్ ద్వారా పర్యాటకులకు వర్చువల్ అనుభూతిని అందిస్తున్నారు. దీని సహాయంతో రియల్‌టైమ్ వాతావరణ సమాచారం.



# నవంబరు తర్వాత ఇరాన్‌పై మళ్లీ బాంబులు

### శాంతి ప్రణాళికను తిరస్కరించిన ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 26:** కాల్పుల విరమణ కోసం ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. నవంబరులో అగ్రరాజ్యంలో జరగనున్న మధ్యంతర ఎన్నికల తర్వాత.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసేందుకు సిద్ధమవ్వాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా తమ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే.. అందుకు బదులుగా హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడంతోపాటు అణుచర్చలను పునరుద్ధరిస్తామని టెహ్రాన్ ప్రతిపాదించింది. ఖతార్ మధ్యవర్తుల ద్వారా ఈ శాంతి ప్రణాళికను అగ్రరాజ్యానికి తెలియజేశామని.. దీనిపై ఒప్పందం కుదిరితే హార్ముజ్‌ను ఏడు రోజుల్లో తిరిగి తెరుస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, దీనిపై ట్రంప్ విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. శాంతి ప్రణాళికకు ఇరాన్ కట్టుబడి ఉంటుందా? అనే దానిపై అమెరికా అధ్యక్షుడికి పలు సందేహాలు ఉన్నాయని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా.. హార్ముజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ తమకే ఉందని ట్రంప్ పదే పదే వాదిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో అడుగు ముందుకేసి.. 'ట్రూత్ సోషల్'లో ఓ పోస్టు చేశారు. హార్ముజ్ పేరుకు బదులుగా 'ట్రంప్ జలసంధి' అని రాసి ఉన్న మ్యాప్ ఫొటోను షేర్ చేశారు. ప్రస్తుతం హార్ముజ్‌లో అమెరికా దిగ్బంధనంతోపాటు ఇరాన్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. దీంతో నౌకల రాకపోకలకు ఇబ్బంది కొనసాగుతూనే ఉంది. తమ ఆస్తులను విడుదల చేయాలని.. చమురుపై ఆంక్షలను తొలగించి, సైనిక చర్యకు ముగింపు పలకాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అలా జరిగితే హార్ముజ్‌లో స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం లభిస్తుందని చెబుతోంది.

# చంద్రుడి దక్షిణధ్రువంపై చైనా, అమెరికాల ఫోకస్



**నాసా, సెప్టెంబరు 26:** చంద్రుడిపై మళ్లీ మనుషుల అడుగులు పడబోతున్న వేళ అక్కడి కొన్ని ప్రాంతాల కోసం అమెరికా, చైనా మధ్య పోటీ ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా చంద్రుడి దక్షిణ ధ్రువం ఇప్పుడు అత్యంత కీలక ప్రాంతంగా మారింది. చైనా ముందుగా అక్కడి కొన్ని ప్రాంతాల్లో మిషన్లు ఏర్పాటు చేస్తే తర్వాత అమెరికా అక్కడికి చేరడం కష్టమయ్యే అవకాశం ఉందని నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్‌మన్ హెచ్చరించారు. చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద ఎప్పుడూ ఎండ పడని ప్రాంతాలు ఉన్నాయి. వీటినే పర్మనెంట్ షాడోడ్ రీజియన్స్ అంటారు. ముఖ్యంగా షాక్లెటన్ క్రేటర్ ఇలాంటి ప్రాంతాల్లో ఒకటి. అక్కడ మంచు రూపంలో నీరు ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భవిష్యత్తులో నీరు, ఇంధనం వంటి వనరుల కోసం ఇవి కీలకంగా మారొచ్చని నాసా చెబుతోంది. చైనా చేపట్టనున్న చాంగ్‌ఈ7 మిషన్ కూడా చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్నే లక్ష్యంగా చేసుకుంది. షాక్లెటన్ క్రేటర్ సమీప ప్రాంతాలపై ఈ మిషన్ దృష్టి పెట్టినట్లు ఐజాక్‌మన్ తెలిపారు. చైనా మిషన్ ఆలస్యం కావడం వల్ల అమెరికాకు కొంత సమయం దొరికిందని ఆయన వ్యాఖ్యానించారు. చాంగ్‌ఈ7లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్, మొబైల్ హాపర్ వంటి నాలుగు రోబోటిక్ వాహనాలు ఉండనున్నాయి. ఇక్కడే అసలు ఆసక్తికరమైన విషయం ఉంది. చంద్రుడిపై ల్యాండర్లు దిగే ప్రాంతాల చుట్టూ భద్రతా కారణాలతో ఇతర వాహనాలు కొంత దూరాన్ని పాటించాల్సి ఉంటుంది. అందువల్ల ఒక దేశం ముందుగా కీలక ప్రాంతంలో కార్యకలాపాలు ప్రారంభిస్తే.. అదే ప్రాంతానికి మరో దేశం చేరుకోవడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అంటే చంద్రుడిపై భూమిపై ఉన్నట్లుగా గోడలు కట్టి సరిహద్దులు పెట్టడం కాదు. కానీ కీలక ప్రాంతాల్లో ముందుగా ల్యాండింగ్, పరికరాల ఏర్పాటు, కార్యకలాపాలు మొదలైతే ఇతర దేశాలకు అక్కడికి చేరుకోవడం మరింత క్లిష్టం కావచ్చు. ఇదే ఇప్పుడు అమెరికా ఆందోళనకు కారణం. చైనా మిషన్ ఆలస్యం కావడంతో అమెరికా ప్రణాళికలకు కొంత అవకాశం లభించింది. నాసా ప్రకారం.. బ్లూ ఆరిజిన్ రూపొందిస్తున్న బ్లూ మూన్ మార్క్1 ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంలోని షాక్లెటన్ కనెక్టింగ్ రిడ్జ్‌కు వెళ్లేలా ప్రణాళిక ఉంది. నాసా షెడ్యూల్‌లో ఈ మిషన్ 2027 జనవరిలో లక్ష్యంగా ఉంది. అక్కడ రెండు నాసా శాస్త్రీయ పరికరాలను దింపనుంది. భవిష్యత్తులో మనుషుల మిషన్లకు అవసరమైన ల్యాండింగ్ సాంకేతికతను పరీక్షించడం కూడా దీని లక్ష్యం. చంద్రుడిపై నీటి ఆనవాళ్లు, భవిష్యత్తు స్థావరాలకు అనువైన ప్రాంతాలు, అక్కడి వనరులపై పరిశోధనలు వేగం పుంజుకుంటున్నాయి.

# సంక్షిప్త వార్తలు

### ఉంగా వేదికగా పాక్ వైఖరిని ఎండగట్టిన భారత్

**న్యూయార్కు, సెప్టెంబరు 26:** ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య మరోసారి మాటల యుద్ధం చోటుచేసుకుంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రసంగానికి భారత్ తన రైట్ ఆఫ్ రిప్లై హక్కును వినియోగించుకుని దీటైన సమాధానమిచ్చింది. ఉగ్రవాదాన్ని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని



భారత దౌత్యవేత్త పేతల్ గెహ్లాట్ పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించారు.

### కాంగోలో కుప్పకూలిన రక్షణ విమానం:14 మంది మృతి



కిన్షాసా, సెప్టెంబరు 26: కాంగోలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. విమానం కూలిపోవడంతో ఇద్దరు సీనియర్ సైనిక అధికారులతో సహా కనీసం 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని కాంగో సైన్యం వెల్లడించింది. మృతుల్లో మిలిటరీ కోర్టు అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ముటోంబో కటలాయి టియెండే, సాయుధ దళాల ఆడిటర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ బకుమి లికులియా ఉన్నారు. వీరితో పాటు ప్రతినిధి బృందంలోని 12 మంది, విమాన సిబ్బంది కూడా ప్రమాదంలో మృతి చెందినట్లు సైనిక వర్గాలు తెలిపాయి.

### సూపర్ ఎల్‌నినోతో మహారాష్ట్రను చుట్టుముట్టిన కరవు!

**ముంబయి, సెప్టెంబరు 26:** సూపర్ ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది దేశంలో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. ఏ రాష్ట్రంలో చూసినా ఈ పరిస్థితులే ఉన్నాయి. ఆశించిన స్థాయిలో ఎక్కడా కూడా వర్షాలు పడలేదు. దీంతో కరవు ఛాయలు అలుముకుంటున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో 74 శాతం తాలూకాల్లో తీవ్ర వర్షాభావం ఉన్నట్లుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో పంటలు దెబ్బతినడంతో పాటు పలు ప్రాంతాల్లో నీటి కొరత కూడా ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 358 తాలూకాల్లో 265 తాలూకాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

### యూరోప్‌తో యుద్ధచర్యలకు మేం సిద్ధం కానేకాదు: పుతిన్



**మాస్కో, సెప్టెంబరు 26:** రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూరప్‌తో ఎలాంటి రకమైన యుద్ధానికీ రష్యా సిద్ధం కావడం లేదని స్పష్టం చేశారు. యూరప్ దేశాలపై రష్యా దాడికి సిద్ధమవుతోందంటూ కొందరు యూరప్, నాటో సభ్య దేశాలు చేస్తున్న హెచ్చరికలను తోసిపుచ్చారు. అదే సమయంలో ఉక్రెయిన్‌తో శాంతి చర్చలను పునఃప్రారంభించే ప్రతిపాదనలు ఇంకా తమ ముందే ఉన్నాయని తెలిపారు. శుక్రవారం సెయింట్ పీటర్స్ బర్గ్‌లో మీడియాతో మాట్లాడిన పుతిన్ యూరప్ దేశాలతో ఉద్రిక్తతలను పెంచుకోవాల్సిన అవసరం రష్యాకు ఏ మాత్రం లేదన్నారు.

### 13 మంది తాలిబన్లు హతం: పాక్

**కాబూల్, సెప్టెంబరు 26:** పాకిస్థాన్‌ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఆఫ్ఘన్ తాలిబన్లు తమ భూభాగంలోకి చొరబడి దాడి చేసేందుకు చేసిన ప్రయత్నాన్ని విజయవంతంగా అడ్డుకున్నామని పాకిస్థాన్ భద్రతా దళాలు ప్రకటించాయి. ఈ ప్రతిదాడిలో కనీసం 13 మంది తాలిబన్ సిబ్బంది మరణించారని, పలువురు గాయపడ్డారని పాక్ సమాచార మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది.

బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని గులిస్థాన్ సెక్టార్‌లో ఈ ఘటన జరిగింది. ఆఫ్ఘన్ వైపు నుంచి తాలిబన్లు పాక్ భూభాగంలోకి ప్రవేశించి దాడికి యత్నించారు.

## భారీ వర్షాల సమయంలో విధుల్లో నిర్లక్ష్యం

**విజయనగరం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజల భద్రత కోసం 24 గంటల కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన వంగర తహశీల్దార్ (ఎఫ్ ఏసి) పి.రామారావు, సంగం వీఆర్వో (గ్రేడ్ వన్) యు.రామచంద్రరావు, వంగర గ్రామ వీఆర్ఏ కె.ఉదయ్ కిరణ్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తహశీల్దార్ అత్యవసర సమయంలో జిల్లా యంత్రాంగం ఫోన్ కాల్స్‌కు స్పందించపోవడం, పరిస్థితిపై సమాచారం అందించకపోవడం, అరసాడ సమీపంలో రహదారి చెట్టువిరిగిన ఘటనపై సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో సస్పెండ్ చేశారు. సంగం వీఆర్వోకు అప్పగించిన కంట్రోల్ రూమ్ విధులను సక్రమంగా నిర్వహించకపోవడం, వంగర వీఆర్వో కంట్రోల్ రూమ్ విధులకు హాజరు కాకపోవడంతో వారిపై సస్పెన్షన్ వేటు వేశారు.

## ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై ఘోర ప్రమాదం

● ఇద్దరు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు

**సింగరాయకొండ, సెప్టెంబర్ 26,ప్రభాతవార్త:** మండలంలోని మూలగుంటపాడు జాతీయ రహదారిపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ వద్ద శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారి మార్జిన్‌లో నిలిపి ఉంచిన లారీని కారు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.పోలీస్ తెలిపిన వివరాలు మేరకు తిరుపతి జిల్లా మంగళం గ్రామానికి చెందిన ఐదుగురు కారులో నెల్లూరు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మూలగుంటపాడు వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టింది. దీంతో కారులో ముందు భాగంలో ఉన్న హరి ప్రసాద్ (39), విశాలాక్షి (36) మృతి చెందా రు. లావణ్యకుమారి, కాన్పిత్, ప్రణతి తీవ్రం గా గాయపడ్డారు. వీరంతా తిరుమలలో ఒక్కం ది ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్ లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కారు తలుపును గునపంతో పగల గొట్టి మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## మరో అంతర్జాతీయ ప్రమాణాల పాఠశాలకు శ్రీకారం

● రూ.39 కోట్ల సీఎస్ఆర్ నిధులతో వెంకటేశ్వరపురం టిడ్కో ప్రాంగణంలో నిర్మాణం

● 2 వేల మంది పేద విద్యార్థులకు ఉచితంగా కార్పోరేట్ స్థాయి విద్య : మంత్రి నారాయణ



**నెల్లూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో విద్యా విప్లవానికి మరో అడుగు పడింది. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో వెంకటేశ్వరపురం టిడ్కో ఇళ్ల ప్రాంగణంలో మరో అధునాతన పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణశ్రీకారంచుట్టారు. రూ.39 కోట్ల సీఎస్ఆర్ నిధులతో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాల భవనానికి పండుగ వాతావరణంలో మంత్రి శంకుస్థాపన చేశారు. పాఠశాలకోసం అధికారులు ప్రణాళిక ప్రకారం 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+1 భవనం, 43 తంగతి గదులు ఏర్పాటు కానున్నాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో స్విమ్మింగ్ పూల్, వివిధ క్రీడలకు అవసరమైన వసతులతో కూడిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూ విద్యాశాఖమంత్రి నారాలోకేష్ ఆలోచనలకు,సీఎం చంద్రబాబు నాయుడి విజన్‌కు అనుగుణంగా వీఆర్ హైస్కూల్ తరహాలో నెల్లూరు నగరంలో మరో 17 ప్రభుత్వ పాఠశాలలను సుమారు రూ.300 కోట్లతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వీఆర్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను తన పిల్లలు కల్పిస్తున్నారని, బస్సుల నిర్వహణ, స్నాక్స్‌ను నారాయణ విద్యాసంస్థల నుంచే అందిస్తున్నామని తెలిపారు.టిడ్కో ప్రాంగణంలోని పాఠశాలలో 2 వేల మంది పేద విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తామని, వారికి కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తామని ప్రకటించారు.భగత్‌సింగ్ కాలనీ వాసులకు శాశ్వత పట్టాలు టిడ్కో ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ భగత్‌సింగ్ కాలనీ వాసల సమస్యను కూడా ప్రస్తావించారు. సుమారు 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం చూపుతూ 1,400 కుటుంబాలకు శాశ్వత పట్టాలు ఇప్పించామని తెలిపారు.సిటీ లో ఐదువేల మందికి శాశ్వత పట్టాలు ఇప్పించటమే లక్ష్యంమన్నారు. నర్వేవల్లి కాలువకట్ట పై నివసిస్తున్న 1215 కుటుంబాలకు శాశ్వత పట్టాలు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

మంత్రి కుమార్తె పొంగూరు షరణి మాట్లాడుతూ తన తండ్రి నారాయణ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. పేదరికం నుంచి వచ్చిన ఆయన పేదల కష్టాలను స్వయంగా అనుభవించారని, అందుకే పేద పిల్లలకు విద్యను ఆస్తిగా అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మూడు ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేశామని, దేశంలోనే ప్రత్యేకంగా నిలిచేలా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. తనను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వామిని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.ఈ కార్యక్ర మంలో ఎంఈఓ తిరుపాల్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, టీడీపీ కోఆప్షన్ సభ్యుడు జమీర్, క్లస్టర్ జహీర్, ప్రెసిడెంట్ షాహీద్ ,సిటీ టీడీపీ మహిళా అధ్య క్షురాలు కపిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు నగరానికి కొత్త హంగులు

● రూ.5.26 కోట్లతో ఫౌంటెన్ల పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ

**నెల్లూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త - వైద్యం :** నగరంలోని ప్రధాన కూడళ్లను సుందరీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 15 ఐలాండ్లను రూ.5.26 కోట్లతో అభివృద్ధి చేయడంతో పాటు ఫౌంటెన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. ఆయా కూడళ్లలోని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెళ్ళిన ప్రతీ చోటా టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవాయిద్యాలతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. వీఆర్సీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం, ట్రంక్‌రోడ్డు గాంధీ విగ్రహం, ఏసీ సెంటర్ ఏసీ సుబ్బారెడ్డి విగ్రహం, ఆజాద్ సెంటర్ వివేకానంద విగ్రహం, నర్తకి సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం, కనకమహల్ సెంటర్ సుందరయ్య విగ్రహం,నక్కలోళ్ల సెంటర్ పట్టాభిరామిరెడ్డి విగ్రహం, బోసుబొమ్మ వద్ద సుభాష్ చంద్రబోస్ విగ్రహం, వెంకటేశ్వరపురం జాకీర్‌హుస్సేన్ విగ్రహం, శెట్టిగుంట రోడ్డులో స్వచ్ఛ భారత్ విగ్రహం, నవాబుపేట బీవీఎస్ స్కూల్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహం, మినీబైపాస్‌లో పూలే, నేతాజీ విగ్రహాలు, యలమవారి దిన్నెలో అంబేద్కర్ విగ్రహం వద్ద పనులు చేపట్టనున్నారు. శంకుస్థాపన చేసిన 14 కూడళ్లలో ఫౌంటెన్ల పనులను త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం స్థల మార్పుపై ఆర్యవైశ్యులు కోరారని, అందరూ ఏకాభిప్రాయానికి వస్తే విగ్రహాన్ని మార్చి కూడలిని సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నేను శిలాఫలకాలకు ప్రాధాన్యత ఇవ్వనని,శంకుస్థాపన రోజే పనులు ప్రారంభిస్తామన్నారు. సిటీలో 17 పాఠశాలల ఆధునీకరణకు రంగం సిద్ధం చేశామని తెలిపారు. రోజుకు పది అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తామని తెలిపారు. 123 మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం రూ.50 వేల కోట్లు కేటాయించారని, రూ.23 వేల కోట్లతో పనులు ఇప్పటికేప్రారంభమయ్యాయని చెప్పారు. డిసెంబరు లోపు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్,మేయర్ సుజాతా, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, టీడీపీ సిటీ అబ్జర్వర్ రాజు, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి,మాజీ కార్పొరేటర్ ఆనం రంగమయూర్ రెడ్డి, డివిజన్ల టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన ఉచిత మెగా వైద్య శిబిరం

**పుట్టపర్తి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** నిరంతరం సమాజ హితం కోసం శ్రమిస్తూ, బిజీ జీవనశైలి కారణంగా స్వంత ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టే జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు తమ వంతుగా అన్ని విధాలుగా చేయుత అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరంను ఘనంగా నిర్వహించబడింది. ఉదయం గణేష్ సర్కిల్ లోని సాయి ఆరామం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ వైద్య శిబిరంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 456 మంది పాల్గొని ఉచిత వైద్య సేవలు పొందారు. అగ్రగామి వైద్య సంస్థల భాగస్వామ్యం ఈ మెగా వైద్య శిబిరంలో దేశంలోనే పేరుగాంచిన ప్రముఖ వైద్య సంస్థల వైద్య బృందాలు పాల్గొని జర్నలిస్టులకు సేవలు అందించాయి. వైదేహి హాస్పిటల్ (బెంగళూరు),స్విమ్స్ (తిరుపతి),బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రజా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, స్టేట్ అసోసి యేషన్, ఏపీ ఎన్ఏ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు,సమగ్ర వైద్య పరీక్షలు, గణాంకాలు వివిధ వి భాగాలకు చెందిన సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్య నిపు ణులు రోగులను క్షుణ్ణంగా పరిశీలించి ఉచితంగా మందులు, అవసరమైన వారికి తదుపరి చికిత్సపైతగిన సలహాలు అందించారు.

## వేపదరువులో 40 లక్షల నుడా నిధులతో నూతన పార్కు

● మంత్రి నారాయణ



**నెల్లూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త - వైద్యం:** రాజకీయాల్లో పోటీ చేసిన ప్రతిసారీ గెలిచిన అజాతశత్రువు వివేకా అన్న.. అభిమానుల గుండెల్లో సదా సజీవం :ఆనం రామనారాయణ రెడ్డికక్ష సాధింపులకు స్వస్తి చెప్పాం.. కూటమి పాలనలో జిల్లా అభివృద్ధిపైనే పూర్తి దృష్టి : నుడా చెర్మన్ కోటంరెడ్డి నెల్లూరులో స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి విగ్రహావిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది..14వ డివిజన్ వేపదరువు వద్ద 40 లక్షల నుడా నిధులతో అభివృద్ధి చేసిన నూతన పార్కును మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ కలసి ప్రారంభించారు..ఈ సందర్భంగా నెల్లూరు ప్రజలకు శుభవార్త తెలిపిన మంత్రి నారాయణ... నగరంలోని పార్కుల్లో ఏసీ కమ్యూనిటీ హాళ్లను నిర్మించి, పేదలకు కేవలం ఒక్క రూపాయి అద్దెకే అందిస్తామని ప్రకటించారు.. అంతే కాదు, 2028 నాటికి నెల్లూరును మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.. ఇక తమ్ముడి రాజకీయ భవిష్యత్తు కోసం తనకు దక్కాల్సిన మంత్రి పదవిని సైతం త్యజించిన గొప్ప మనసు వివేకా అన్నదని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అత్యంత భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు.

మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ తమ్ముడి కోసం పదవులను త్యజించిన వివేకాతో తనకు అవినాభావ సంబంధం ఉందని, 2014లో 5,300 కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేశామని గుర్తుచేశారు.. సిటీలో ఆధునీకరిస్తున్న 50 పార్కుల్లో ఇప్పటికే 45 పార్కులను అందుబాటులోకి తెచ్చామని, పార్కులలో ఏసీ కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేసి పేదలకు కేవలం 1 అద్దెకే అందిస్తామని, యుజీడి పనులు పూర్తి చేసి దోమలు లేని నగరంగా, ప్రతి 5 మీటర్లకు ఒక చెట్టు నాటి గ్రీన్ సిటీగా, ప్రతి ఇంటికీ తాగు నీటి కుళాయి ఇస్తామన్నారు..అంతేకాకుండా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం 50,000 కోట్లు మంజూరు చేశారని, 2028 కల్లా నెల్లూరును మోడల్ సిటీగా మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ వివేకానందరెడ్డి రాజకీయాల్లో ఏ ఎన్నికల్లో పోటీ చేసినా విజయం సాధించిన అజాతశత్రువు అని, నెల్లూరుకి దూరం కాకూడదనే ఉద్దేశంతో తనకు 3 సార్లు మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్నా నా కోసం వద్దనుకొని త్యాగం చేశారని, తన రాజకీయ ప్రస్థానానికి తొలి మెట్టు వేసిన వివేకా అన్న అభిమానుల గుండెల్లో సజీవంగా ఉన్నారన్నారు.

## ఇసి విశ్వసనీయతను స్పష్టం చేసిన ఉమ్మడి ప్రకటన

● సర్‌తో తొలగిన అపోహలు : సిఎం చంద్రబాబు



**విజయవాడ,సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఈసీ స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పై ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా చేసిన ప్రకటన అపోహలకు ముగింపు పలికిం దని సిఎం నారా చంద్రబాబు నాయుడు"ఎక్స్" వేదికగా వ్యాఖ్యానించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు ఎస్. ఎస్. సంధూ, వివేక్ జోషి కలిసి ఏకగ్రీవంగా ఇచ్చిన వివరణ మన రాజ్యాంగ సంస్థల సమ గ్రతను, విశ్వసనీయతను మరోసారి స్పష్టం చేసిందని సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న అపోహలకు తెరదించింది.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన నిర్ణయాలు సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ తీసు కుంటారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవ స్థ, ఎన్నికల ప్రక్రియలపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు దురదృ ష్టకరం. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయి. బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాతనంతో స్వీకరిం చడం కూడా నాయకత్వ లక్షణమే. మన రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యం. భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అన్నారు.

## ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు కొత్త ఊపిరి పోస్తున్న లేపాక్షి

● రూ.1.55 కోట్ల కేంద్ర సహాయంతో 24 కార్యక్రమాలు

● రాష్ట్రవ్యాప్తంగా 840 మంది కళాకారులకు ప్రయోజనం

● లేపాక్షి హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ వెల్లడి

**విజయవాడ, సెప్టెంబర్ 26,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకాళహస్తి కలంకారీ, బొబ్బిలి వీణ, దుర్గి రాతి శి ల్పం, కొబ్బరి చిప్పలు, తాటాకు, వెదురు తదితర సంప్రదాయ హస్తకళలకు మరింత ప్రోత్సా హం అందించేందుకు లేపాక్షి హస్తకళల అభివృద్ధి సం స్థ విస్తృత కార్యక్రమాలను చేపడుతోంది. 202 6-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా వివి ధ హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక శిక్షణ, డిజైన్ అభివృద్ధి, ఆధునిక పనిముట్ల పంపిణీ కార్యక్రమా లను నిర్వహించనుంది.లేపాక్షి హస్తకళల అభివృ ద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ కళల్లో నైపుణ్యం కలిగి న కళాకారులకు ఆధునిక డిజైన్లు, సాంకేతికత, మెరుగైన పనిముట్లపై శిక్షణ ఇవ్వడంతో పాటు మార్కెట్ అవకాశాలను పెంచడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కేంద్ర జౌళి మంత్రి త్వ శాఖకు చెందిన డెవలప్‌మెంట్ కమిషనర్ (హ్యాండీక్రాఫ్ట్స్) 24 కార్యక్రమాలకు సుమారు రూ.1.55 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 840 మంది కళాకారులకు ప్రయోజనం కలగనుం ది.అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో గురు శిష్య హస్తశిల్ప్ శిక్షణ కార్యక్రమం , డిజైన్ అండ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ వర్క్‌షాపులు, మెరుగైన పనిముట్ల పంపిణీ కార్యక్రమం ఉన్నా యి. వీటితో పాటు విజయవాడలో 10 రోజుల గాంధీ శిల్ప బజార్‌ను నిర్వహించనున్నారు.గురు శిష్య శిక్షణ కార్యక్రమంలో కొబ్బరి చిప్పలతో కళా కృతుల తయారీ, చెక్క బ్లాక్‌ల తయారీ, శ్రీకాళ హస్తి కలంకారీ, తాటాకు కళ, కలంకారీ బ్లాక్ ప్రింటింగ్, దుర్గి రాతి శిల్పం, అగరబత్తుల తయా రీ వంటి సంప్రదాయ కళల్లో శిక్షణ ఇవ్వనున్నా రు. ఒక్కో కార్యక్రమంలో 30 మంది కళాకారులు పాల్గొంటారు. రాజమహేంద్రవరం, విజయవాడ, విష్ణువాసం, కాకినాడ, గుంటూరులోని లేపాక్షి కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిం చనున్నారు. డిజైన్ అండ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ వర్క్‌షాపుల ద్వారా సంప్రదాయ కళలను ఆధునిక డిజైన్లు, సాంకేతికతతో అను సంధానం చేయనున్నారు. క్రోషే లేస్, టెర్రకోట బొమ్మలు, బొబ్బిలి వీణ, చెక్క శిల్పాలు, ఇమిటే షన్ జువెలరీ, కేన్ అండ్ బాంబూ, అల్లగడ్డ రాతి శిల్పం, సవర గిరిజన చిత్రకళ, కలంకారీ బ్లాక్ ప్రింటింగ్ వంటి కళల్లో వర్క్‌షాపులు నిర్వహించనున్నారు. కళాకారులకు అవసరమైన పని ముట్లను ఆధునీకరించడంపైనా దృష్టి సారించా రు. మెరుగైన పనిముట్ల పంపిణీ కార్యక్రమం కిం ద అరటి పీచు, దుర్గి రాతి శిల్పం, కేన్ అండ్ బాంబూ, చెక్క పనులు, లక్కపని చేసే 200 మంది కళాకారులకు ఆధునిక టూల్‌కిట్లను అం దించనున్నారు. డిసెంబర్‌లో అనంతపురం, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మార్కెట్ అవకాశాలను పెంచే చర్యల్లో భాగంగా విజ యవాడలో అక్టోబర్ 9 నుంచి 18 వరకు గాంధీ శిల్ప బజార్ నిర్వహించనున్నారు. పది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ సంప్ర దాయ హస్తకళలకు చెందిన 70 మంది కళా కారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయిం చుకునే అవకాశం లభిస్తుంది. ఇందుకోసం రూ.19.48 లక్షలు మంజూరయ్యాయిజసం ప్రదాయ హస్తకళలను ఆధునిక మార్కెట్లకు అను సంధానం చేయడం ద్వారా కళాకారుల నైపుణ్యం, ఉత్పాదకత, ఆదాయాన్ని పెంచేందుకు ఈ కార్య క్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.రాష్ట్రంలోని గొప్ప హస్తకళల వారసత్వాన్ని కాపాడటంతో పాటు వాటిని ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లేపాక్షి లక్ష్యం. సంప్రదాయ నైపుణ్యాలను తరువాతి తరాలకు అందించడంతో పాటు కళాకారులకు మెరుగైన పనిముట్లు, ఆధునిక డిజైన్లు, విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడంపై దృష్టి సారిస్తున్నాం" అని లేపాక్షి హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ తెలిపారు.

## ఎఐ ఆధారిత జిఎస్టి అమలులో ఎపి మోడల్ అద్భుతం..

● యథాతథంగా అమలు చేయడానికిఆసక్తి ప్రదర్శించిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం.

● ఎపి వాణిజ్య పన్నుల శాఖకు ప్రశంసలు,ఛత్తీస్‌గఢ్‌కు సాంకేతిక సహాకారం అందించాలని విజ్ఞప్తి.



**అమరావతి, సెప్టెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ అమలును సమర్థవంతంగా నిర్వహించడం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ అమ లు చేస్తున్న కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటి లిజెన్స్) ఆధారిత ఎండ్ టు ఎండ్ ట్యాక్స్ సొ ల్యూషన్స్ విధానం దేశంలోని పలు రాష్ట్రాలను ఆకట్టుకుంటోంది. ఈ విధానాన్ని తమ,తమ రా ష్ట్రాల్లోనూ అమలు చేయడానికి ఆయా రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇందులో భాగంగా పలు రాష్ట్రాలకు చెందిన పన్నుల శాఖ ప్రతినిధుల బృం దం ఏపీ వాణిజ్య పన్నుల శాఖ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ విధానాన్ని అధ్యయనం చేయడానికి రాష్ట్రానికి వరుస కడుతున్నాయి. తా జాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా తమ రాష్ట్రంలో ఏ పీ మోడల్‌ను అమలు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేస్తోంది. దీనికోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పన్నుల శాఖ కు చెందిన ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖను సందర్శించి ఆ శాఖ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ మోడల్‌ను అధ్యయ నం చేసింది. ఛత్తీస్‌గఢ్ ఐఆర్ఎస్ ప్రత్యేక కమి షనర్ తరన్నుమ్ వర్మ నేతృత్వంలో జాయింట్ కమిషనర్ నరేంద్ర వర్మ, డిప్యూటీ కమిషనర్లు హేమంత్ సిన్హా, ప్రకాశ్ గుప్తే, అసిస్టెంట్ కమిషనర్ పూర్వ గుప్తే, సిస్టమ్ అనలిస్ట్ రిధిమా శర్మ లతో కూడిన ప్రత్యేక బృందం మూడు రోజుల పా టు ఏపీలో అధ్యయనం చేసింది. ఈ బృందానికి రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ చీఫ్ కమీషనర్ బాబు ఏ సాదర స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ ప్రత్యేకతల గురించి వారికి వివరించారు. మూడు రోజుల పా టు ఈ బృందం ఐటీ, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషి యల్ ఇంటిలిజెన్స్, లీగల్ ఏఐ, కేస్ మేనేజ్మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పన్ను ఎగవేతల నిరోధక వ్యవస్థ, ఆదాయ వృద్ధి, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, సాంకేతికత ఆధారిత క్షేత్రస్థాయి కార్యకలాపాల వంటి అంశాలపై చర్చలు జరపడంతో పాటు వాటిని అధ్యయనం చేశారు. తొలిరోజు ఐటీ, డీఏసీ విభాగంలో వాణిజ్య పన్ను ల శాఖ అమలు చేస్తున్న ఐటీ, డేటా అనలిటిక్స్, ఏఐ కార్యక్రమాలపై ఛత్తీస్‌గఢ్ ప్రతినిధి బృందా నికి అవగాహన కల్పించారు. లీగల్ విభాగంలో ఆధ్వర్యంలో కేస్ మేనేజ్మెంట్, లిటిగేషన్ ట్రాకిం గ్ న్యాయపరమైన కేసుల నిర్వహణలో ఏఐ విని యోగంపై సోదాహరణంగా వివరించారు. రెండవ రోజు ఎన్‌ఫోర్స్‌మెంట్, పన్ను ఎగవేత నిరోధక చర్యలు, ఆదాయ ధోరణులు, ఆదాయ వృద్ధి వ్యూహాలు, సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (సీఆర్‌యూ) పనితీరుపై ప్రతినిధి బృందానికి వివరిం చారు. క్షేత్రస్థాయి పర్యటనలు, వాహనాల తని ఖీల కోసం రూపొందించిన మొబైల్ అప్లికేషన్లను, వాటి పనితీరు గురించి వివరించారు. ఏపీ వాణ జ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ మా ట్లాడుతూ జీఎస్టీ చట్టం అమలులో కృ త్రిమ మే థ వినియోగిస్తున్న విధానంపై సవ గ్రంగా ఛత్తీస్ గఢ్ ప్రతినిధి బృందానికి వివరిం చారు. డేటాను సమగ్రంగా విశ్లేషించడం ద్వారా అది క్షేత్ర స్థాయిలో అధికారులకు సహకరించడమే కాకుండా నిర్దేశిత లక్ష్యాలు సాధిం చడానికి, పన్ను ఎగవే తలను నిరోధించడానికి కూడా ఏఐ ఎంతో ఉపయోగడపడుతుం దని ఆయన వివరించారు. చట్టబద్ధమైన నిర్ణయాలను మాత్రం సంబంధిత అధికారులే తీసుకుంటారని స్పష్టం చేశారు.

**జీఎస్టీ విచారణలో ఎండ్ టు ఎండ్ ఏఐ పరిష్కారం..**

జీఎస్టీ కేసుల విచారణకు సంబంధించి ఏపీ వాణిజ్యపన్నుల శాఖ రూపొందించిన ఎండ్ టు ఎండ్ ఏఐ ఆధారిత పరిష్కారం ఛత్తీస్‌గడ్ బృం దాన్ని ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ప్రమాదకరమైన, క్లిష్టతరమైన పన్ను చెల్లింపుదారులను గుర్తించ డానికి రిస్క్ ప్రొఫైలింగ్, కేసుల ఎంపిక, కేసుల కేటాయింపు, డేటాలో వ్యత్యాసాలు, అను మానాస్పద లావాదేవీల నమూనాలను గుర్తిం చడం, విచారణ విశ్లేషణతోపాటు జీఎస్టీ చట్టం, నిర్దేశిత విధానాలకు అనుగుణంగా చట్టబద్ధమైన నోటీసులు, సమాచార పత్రాలు, ఉత్తర్వుల ముసాయిదాలను రూపకల్పన వరకు సమస్తం ఈ ఏఐ సహకారంతో నిర్వహిస్తున్నామని బాబు ఏ వివరించారు.

## దసరా భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్

● పరిశీలించిన కలెక్టర్

● నిపుణులతో పరిశీలించి రిటైనింగ్ వాల్ పటిష్టం చేయాలని ఆదేశం





**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో – ఇంద్రకీలాద్రిపై దసరా భద్రతా ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖరబాబు ఈవో శ్రీ వి.కె. శీనా నాయక్‌తో కలిసి క్యూలైన్లు, పూజా ప్రాంగణాలు, మహా మండపం క్షేత్రస్థాయి తనిఖీ చేశారు. భక్తుల రద్దీ నియంత్రణ, భద్రతే ప్రథమ ప్రాధాన్యంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాల భద్రత మరియు ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శనివారం ఇంద్రకీలాద్రిని పరిశీలించారు, కొండపైన, పరిసర ప్రాంతాలలో భక్తుల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపై ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల మార్గాలు, బారికేడింగ్ పటిష్టత, వివిధ పూజలు నిర్వహించే ప్రదేశాలను సీపీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా రద్దీ తీవ్రంగా ఉండే సమయాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా మహా మండపంలోని ఖాళీ ప్రదేశాలలో భక్తులను వేచి ఉంచేందుకు గల అవకాశాలను పరిశీలించి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్ టౌన్ సీఐ గుణ రామ్, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.రమ, ఆలయ వైదిక కమిటీ సభ్యులు వి.శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

**- ఘాట్ రోడ్డు పరిశీలించిన కమిషనర్:**

దుర్గమ్మవారి ఆలయ ఘాట్‌రోడ్డుపై కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ పరిశీలించారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని శనివారం కమిషనర్ దేవస్థాన అధికారులు మరియు ఇంజినీరింగ్ సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి ఆయన ఘాట్ రోడ్డులోని ప్రభావిత ప్రాంతాన్ని, రక్షణ గోడలను, కొండ వాలు భాగాలను నిశితంగా తనిఖీ చేసిన సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ మాట్లాడుతూ రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భక్తుల రక్షణే అత్యంత ప్రధానమని స్పష్టం చేశారు. నేషనల్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం) అధ్యయనం ఆధారంగా కార్యాచరణ. గతంలో ఇంద్రకీలాద్రి కొండ చరియల స్థిరత్వంపై బెంగళూరుకు చెందిన ప్రతిష్ఠాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ శాస్త్రవేత్తలు సమగ్ర అధ్యయనం చేసి సమర్పించిన సాంకేతిక నివేదిక ఆధారంగా చేపట్టవలసిన రక్షణ పనులపై ఘటనా స్థలంలోనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్త జైన్, దేవాదాయ శాఖ సాంకేతిక సలహాదారు సుబ్బారావు, చీఫ్ ఇంజినీర్ శేఖర్ మరియు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్‌లతో కలిసి కమిషనర్ కీలక అంశాలపై చర్చించారు. వర్షపు నీటి ఊట కారణంగా పట్టు కోల్పోయిన వదులైన రాళ్లను శాస్త్రీయ పద్ధతిలో తొలగించడం, కొండ వాలును పటిష్టం చేసేందుకు అవసరమైన రాక్ బోల్టింగ్, షాట్‌క్రీటింగ్ పనులను పరిశీలించారు. కొండ పైనుండి రాళ్లు రోడ్డుపైకి రాకుండా ఏర్పాటు చేసిన హై టెన్సైల్ ఐరన్ ఫెన్సింగ్ నెట్లను (రాక్‌ఫాల్ నెట్టింగ్) సరిచూసి, అవసరమైన చోట్ల నూతన రక్షణ నెట్లను అమర్చేందుకు గానూ మరియు కొండపై భాగం నుండి వర్షపు నీరు కొండచరియల్లోకి ఇంకి ఒత్తిడి పెంచకుండా, ప్రత్యేక డ్రైనేజీ చానల్స్ ద్వారా నీరు నేరుగా కిందకు వెళ్లేలా చర్యలు తీసుకోవడానికి ఎన్ఐఆర్ఎం వారి సూచనలు మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**- అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన:**

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడ ఆటోనగర్, పటమటకు చెందిన కళాక్షేత్ర ది డాన్స్ అకాడమీ పి. మోనిక, ఎ. గీతల శిష్యబృందం ఈ నృత్య ప్రదర్శనను అత్యంత మనోహరంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య అంశాలు భక్తిభావాన్ని నింపాయి. గోవింద శ్రిత స్తోత్రం శ్రీమహావిష్ణువు లీలలను కీర్తిస్తూ సాగిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారులను ఆలయ అధికారులు అభినందించి శ్రీ అమ్మవారి ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

**- అన్నప్రసాద సెల్లార్‌లో దేవస్థాన ప్రధాన స్టోర్స్:**

:శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని ప్రధాన స్టోర్స్‌ను కొండ దిగువన ఇటీవల నూతనంగా ప్రారంభించిన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం సెల్లార్‌లోకి మార్చారు. శనివారం ఉదయం నూతన స్టోర్స్ ప్రాంగణంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నూతన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా మెయిన్ స్టోర్స్ మహా మండపం 6వ అంతస్తులో ఉండటం వల్ల నిత్యం దేవస్థాన అవసరాలకు సరుకులు కొండపైకి చేరవేయడం, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ కోసం లిఫ్టులను నిరంతరం వినియోగించడం వల్ల సమయం వృథా కావడంతో పాటు మానవ వనరుల శ్రమ పెరిగేదని తెలిపారు. అంతేకాకుండా దర్శనార్థం లిఫ్టులను ఆశ్రయించే వృద్ధులు, దివ్యాంగులైన భక్తులకు తీవ్ర అసౌకర్యం కలిగేదని పేర్కొన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా స్టోర్స్ విభాగాన్ని కొండ దిగువన ఉన్న విశాలమైన అన్నప్రసాద సదనం సెల్లార్‌లోకి శాశ్వతంగా తరలించినట్లు వివరించారు. దినదినాభివృద్ధి చెందుతున్న దేవస్థానంలో భక్తుల రద్దీ, ఆలయ అవసరాలు మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పాలనా వ్యవస్థలను సమూలంగా ఆధునీకరిస్తున్నామని ఈవో స్పష్టం చేశారు.

## క్యాన్సర్ బాధిత కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం

**లక్కవరపుకోట, సెప్టెంబర్ 26, ప్రభాత వార్త :**



మండలం కిత్తన్నపేట పంచాయతీ శివారు రేవళ్లపాలెం గ్రామానికి చెందిన పోలమరశెట్టి నాయుడు నోటి క్యాన్సర్‌తో తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రామకృష్ణ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఎల్.కోటలోని తన స్వగృహంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని స్వయంగా అందజేశారు. ఆపద సమయంలో తమ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచిన మళ్ల రామకృష్ణకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రేవళ్లపాలెం గ్రామంలో జకేరు సర్పంచ్ బుద్ధ అప్పారావు, పోలమరశెట్టి వెంకట్రావు సహకారంతో ఎల్ కోట అలాగే చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన 173 మంది దాతలు కలిసి రూ. 2.10 లక్షలు సేకరించి బాధిత కుటుంబానికి అందించారు. మొత్తం గా 3.10 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు కార్యక్రమంలో తెలుగు యువత ఎల్.కోట మండల అధ్యక్షులు శ్రీనాథ్ రాజేష్, ఎల్.కోట గ్రామ పార్టీ అధ్యక్షులు అయితంశెట్టి రాము, పోలమరశెట్టి వెంకట్రావు, దొడ్డి నాగార్జున పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల ప్రత్యేకాధికారిగా రజని



**శృంగవరపుకోట, సెప్టెంబర్26, ప్రభాతవార్త**

ఎస్.కోట మండల ప్రత్యేకాధికారిగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎల్.రజనీని నియమించారు. ఈమేరకు శనివారం ఆమె ఎస్.కోట ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీవో నాగేశ్వర్రావు ప్రత్యేకాధికారి రజనీకి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జామి మండలానికి సీపీఓ పి.బాలాజీ, లకవరపుకోట మండలానికి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.భానులత, కొత్తవలస మండలానికి మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రవికిరణ్, వేపాడ మండలానికి ఏపీఎంఐసీ ప్రోజెక్ట్ డైరెక్టర్ పీఎన్ వి. లక్ష్మీనారాయణను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

## వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

**బలిజిపేట, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :**



బలిజిపేట మండలంలో ఇటీవల కురిసిన భారీ తుఫాన్ కు ముంపుకు గురైన పెద్ద పింకీ మరియు నూకల వాడలో కుటుంబాలను పరామర్శించి పరిస్థితిని తెలుసుకొని సుమారు 140 కుటుంబాలకు నిత్యవసర సరుకులను పార్వతీపురం మాజీ శాసనసభ్యులు జోగారావు పంపిణీ చేశారు మీ కష్టకాలంలో నేనుంటానని భరోసా ఇచ్చారు . కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు పాలవలస మురళి మాజీ జడ్పిటిసి అలజంగి రవికుమార్ మాజీ వైస్ ఎంపీపీ వెలిది సాయిరాం పెద్ద పింకీ మాజీ సర్పంచ్ పాపారావు మాజీ ఎంపిటీసీ శ్రీనివాస్ నూకలవాడ మాజీ సర్పంచ్ వెంకటరమణ తప్పిట ప్రసాద్ రావు వాసు గ్రామ ప్రజలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గవర వీధిలో భారీ అన్న సమారాధనలో గవర కార్పొరేషన్ డైరెక్టర్

**లక్కవరపుకోట, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :**



మండలంలోని ఎల్.కోట మేజర్ పంచాయతీ గవర వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా గౌరి సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌరి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం మేళ తాళలతో వినాయక ఊరేగింపు నిర్వహించిభక్తి శ్రద్దలతో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపు లో పిల్లలు పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నృత్యలు చేస్తూ సందడి చేశారు.

## అంగన్వాడీ ఆధ్వర్యంలో సేవా సంకల్పం అభియాన్

**బలిజిపేట, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :**



బలిజిపేట మండలం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవ సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడి ఉత్సవం 3 రోజులు ప్రతి సెంటర్‌లో నిర్వహించడం జరిగింది నిర్వహణలో భాగంగా ఈ ఉత్సవం ఐ సి డి ఎస్ ఐసిడిఎస్ బలిజిపేటలో సిడిపిఓ ఆధ్వర్యంలో కొట్టేసే కాలనీలో అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమం జరిగాయి. మాతృ సంరక్షణ టీకాలు, సామాజిక సేవల కార్యక్రమాల గురించి, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం గురించి . పోషకాహారం గురించి, ప్రీస్కూల్ గురించి లబ్ధిదారులకు తెలియజేయడమైనది. కార్యక్రమంలో తల్లులందరు హాజరై అంగన్వాడి కార్యకర్తను ఘనంగా సత్కరించారు తల్లులు చురుకైన భాగస్వామ్యాన్ని అందించారు .ప్రభుత్వ పోషణ ఆరోగ్య మహిళా సంబంధిత పథకాల గురించి పిల్లలకు తల్లులకు వివరించడమైనది చిన్నపిల్లల కోసం వినోదాత్మక కార్యక్రమాలు చేయడమైనది. నారాయణపురం 2, రావివలస, బలిజిపేట 2, అంగన్వాడీ కేంద్రాల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించారు. తల్లులు, సూపర్వైజర్స్ , ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారుల పెన్షన్ల మంజూరుకు డిమాండ్



**లక్కవరపుకోట, సెప్టెంబర్ 26, ప్రభాత వార్త :**

మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ అక్టోబర్ 1వ తేదీ నుంచి పింఛన్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని అన్నారు. జీవో నంబర్లు 190, 191 ప్రకారం చర్మకారులు, డప్పు కళాకారులకు ఎటువంటి నిబంధనలు విధించకుండా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు డప్పు కళాకారులకు గజ్జెలు, డప్పులు, దుస్తులు ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు. చర్మకారులకు అవసరమైన పనిముట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇతర పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరి వివరాలు ఆయా పంచాయతీల సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయని తెలిపారు. ఎటువంటి నిబంధనలు, షరతులు విధించకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అక్టోబర్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దరఖాస్తు చేసుకున్న వారందరినీ ఐక్యం చేసి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్ కోట మండల సిపిఎం పార్టీ అధ్యక్షులు తరిని వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

## పాచిపెంట పిహెచ్‌సిలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు

**పాచిపెంట, సెప్టెంబర్ 26, ప్రభాత వార్త :**



మండల కేంద్రమైన పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడతామని పార్వతిపురం మన్యం జిల్లా వైద్యాధికారినీ విజయలక్ష్మి అన్నారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం పనుకువలస పంచాయతీలో పారమ్మకొండ వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరంను జిల్లావైద్యాధికారిని విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభాతవార్త జిల్లా వైద్యాధికారిణి పలకరించగా ప్రభాతవార్తతో కొద్దిసేపు ఆమె ముచ్చటించారు. ఈ సందర్భంగా ,(ప్రభాతవార్త) పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత కొన్ని నెలలుగా పిహెచ్సిలో పనిచేస్తున్న పి. హెచ్.ఎన్. హెల్త్ విజిటర్ ,ఎమ్ ఎన్ ఓ, ఎస్ ఎన్ పి,లు డిప్యూటేషన పై ఇతర ప్రాంతాలకు పంపించడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో క్షేత్రస్థాయి పర్యవేక్షణ లోపంతో పలువురు రోగులు ఇబ్బందులు గురవుతున్నారన్న విషయం జిల్లా వైద్యాధికారిని కి వార్త విలేకరు తెలియజేయగా ఈ విషయంపై ఆమె స్పందించి పిహెచ్సిలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. గతంలో పాచిపంట పిహెచ్సిలో సిబ్బంది కొరత అనే వార్త( ప్రభాత వార్తా) పత్రికలో ప్రచురించినప్పటికీ చర్యలు చేపట్టలేదు అన్న విషయం జిల్లా వైద్యాధికారిని వద్ద ప్రస్తావించగా ఆమె విలేకరి ప్రశ్నకు కొత్తగా విధి ల్లో చేరానని ఆమె బదులు ఇచ్చారు. పాచిపెంట పిహెచ్సిలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడతామని అన్నారు.

## అమ్మయ్య అన్నక్యాంటీన్ ప్రారంభమౌతుందోచ్ ..!

### రేపు గ్రాండ్‌గా మంత్రి చేతులమీదుగా రిబ్బన్ కటింగ్

**సాలూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :**



సాలూరు నియోజకవర్గంలో ఐదు రూపాయల భోజనంకు ఎదురుచూస్తున్నవారికి శుభవార్త సంకేతలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఈనెల 28తేది సోమవారం మంచిమూహుర్తన మంతి సంధ్యారాణి చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేస్తూ ప్రారంభిస్తారని పక్కాసమాచారం వినిపిస్తుంది. కొద్దిగా ఫ్లాష్ బ్యాక్ లోకి వెళితే గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అన్నక్యాంటీన్లు ఇప్పుడు కూటమి సర్కార్ లో కూడా పలుపట్టణాల్లో 5కే భోజనం అందిస్తున్నాయి. అదేమంచి ఉద్దేశంతో పట్టణ ఎమ్మార్వో ఆఫీస్ ఆవరణలో అక్షరాల 60లక్షలతో అన్నక్యాంటీన్ భవణ నిర్మాణానికి మంత్రి సంధ్యారాణి భూమిపూజచేసి శ్రీకారం చుట్టారు. అయితే అనుకున్నంత వేగంగా అన్నక్యాంటీన్ ఓపెనింగ్ కాకపోవడంతో పలువిమర్శలకు దారితీసాయి. అలాగే మినిస్టర్ ఇలాకాలో భవణం నిర్మించి రంగులేసి వదిలేయడంతో కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు భంగమని ఆరోపణలు కూడా వినిపించాయి. అంతేకాకుండా ఈ మధ్యన వార్త పత్రికలో వచ్చిన అన్నక్యాంటీన్ భవణంకు శుభంకార్డు పడుతుందా ! అనే వార్త ప్రశ్నకు ఇప్పుడు సమాధానంగా శుభంకార్డు పడడం సూచనలు రావడంతో అందరు ఆర్షిస్తున్నారు. అప్పుడు అన్నగారు హయాంలో రాష్ట్ర పేదలకోసం అన్నక్యాంటీన్లు ప్రారంభిస్తే ఇప్పుడు అమ్మ చేతుల మీదుగా అన్నక్యాంటీన్ ప్రారంభోత్సం జరిగితే అటు టీడీపీ శ్రేణుల కళ్లలో ఆనందం కనిపిస్తుంది. అలాగే ఇటు పేదలకడుపు నిండుతుంది. అంతేకాకుండా ప్రతిరోజు టౌన్‌లో చర్చనీయాశంగా మారిన ఈ టాపిక్‌కి పునిస్టాప్ పడుతుంది.

## కేంద్రాలలో సేవా సంకల్ప్ అభియాన్ అమలు చేయాలి

**రామభద్రపురం, సెప్టెంబర్ 26, ప్రభాత వార్త:**



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకొని సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రాలలో ఉత్సవాలు జరుగుతాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ కృష్ణకుమారి సూర్య కుమారి రత్నకుమారి తెలిపారు. శనివారంఈ కార్యక్రమాన్ని పాఠశాల బుసాయవలస రామభద్రపురం.పూడి వీధి 6 సెంటర్ మామిడి వలసగ్రామాల్లో గల అంగన్వాడి కేంద్రాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఈనెల 25 నుండి అక్టోబర్ 7వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ఉత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కేంద్రంలో అందించే సేవలు గురించి, ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించనున్నట్లు తెలిపారు. అలాగే ఐసిడిఎస్ ద్వారా పిల్లలకి అందించే పౌష్టికాహారంను ఇంటి వద్ద ఏ విధంగా తయారు చేసుకోవాలన్నది పిల్లలకు ఏ విధంగా తినిపించాలన్నదే అంశాలపై బాలింతలకు వివరించారు. అలాగా పిఎంఎం ఇవై లబ్ధిదారులను వివరించారు. ఈ సందర్భంగా తమ పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రీ స్కూల్ విద్య, పౌష్టికాహారము, ఆరోగ్యపరమైన సేవలు అందిస్తున్నందుకు అంగన్వాడీ టీచర్స్ కు ఆయాలకుతెలిపారు. కార్యక్రమంలో సూర్య కుమారి రత్నకుమారిఅంగన్వాడి టీచర్ మంగమ్మ హెల్పర్ రామలక్ష్మి గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## శివరాం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు



**గరివిడి, సెప్టెంబర్ 26, ప్రభాత వార్త:**

మండలంలోని శివరాం 2 అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గరివిడి ఐ సి డి ఎస్ సి డి పి ఓ ఆరుద్ర పర్యవేక్షణలో, సూపర్ వైజర్ ఎస్.భారతి ఆధ్వర్యంలో ప్రధాని 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి అయిన నేపథ్యంలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ ల బలోపేతం పై వారు ప్రసంగించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణీలు, బాలింతలకు అందించే సేవలపై వారు చిన్నారుల తల్లిదండ్రులకి వివరించారు. ఆహారం బిడ్డలకు అందించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఏ.భానుమతి, కళ్యాణి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో రిలీఫ్ : మంత్రి

**సాలూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :**



రాష్ట్ర పేదప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కొండంత అండగా ఉంటుందని రాష్ట్రమంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. శనివారం ఉదయం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 6లక్షల 85వేల 268 రూపాయల చెక్కులు సంధ్యారాణి చేతుల మీదుగా లబ్ధిదరులకు అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న ఒక లబ్ధిదారుడు ఆటోలో రావడంతో స్వయంగా అతని దగ్గరకు వెళ్లి మంత్రి చెక్కను అందజేసారు. అనంతరం ఆమె మాట్లాడుతు పేదలకు ఆరోగ్య సమస్యల సమయంలో సీఎం సహాయనిధి ఎంతో దోహద పడుతుందని క్లారిటీ ఇచ్చారు. అలాగే తమకు కష్టకాలంలో ఆదుకున్న సీఎం చంద్రబాబు ఇంకా మంత్రి సంధ్యారాణికి లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మాది. చిట్టి, వైకుంతపు. హర్షవర్ధన్, మజ్జి.నటరాజ్, అక్కేన.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## చింతలవలస అంగన్వాడీ కేంద్రంలో పోషకోత్సవాలు



**దత్తిరాజేరు, సెప్టెంబర్26, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ఎస్ చింతలవలస అంగన్వాడి కేంద్రంలో పోషక మరియు అంగన్వాడి ఉత్సవాలు శనివారంఘనంగా నిర్వహించారు. పోషకఆహార పదార్థాలు, మరియు పిల్లలు విద్య ప్రాముఖ్యత గురించి. వివరించడం జరిగిందని. అంగన్వాడి సూపర్వైజర్ డి.శ్యామలత అన్నారు. కార్యక్రమంలో గర్భిణీలు బాలింతలు తీసుకోవలసిన పోషక పదార్థాలపై అవగాహన కల్పించారు, గర్భిణీలు బాలింతలు తీసుకోవాల్సి పోషక పదార్థాలు, పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు పండ్లు గుడ్లు పాలు చిరుధాన్యాలు తదితర పోషక పదార్థాలను ఆహారంలో భాగశీగా తీసుకోవాలని తెలిపారు. పిల్లలకు నేర్పిస్తున్న ఆటపాటలు విద్య కోసం తల్లులకు అవగాహన కనిపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు. ఆయాలు. తల్లుల పిల్లలు పాల్గొన్నారు.

## ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్థునికి ఎస్ఎంఎస్ యాజమాన్యం ఆర్థిక చేయూత

**గరివిడి, సెప్టెంబర్ 26, ప్రభాత వార్త:**



మండలంలోని చుక్కవలసకి చెందిన గదల ఈశ్వర రావు అనే ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్థునికి గర్భాము ఎస్ ఎం ఎస్ ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ యాజమాన్యం 30 వేల రూపాయలు ఆర్థిక చేయూత అందించింది. ఈ మేరకు ముప్పై వేల రూపాయల సాయాన్ని విరాళాలు సేకరించే సభ్యులకు గరివిడి లో ఎస్ ఎం ఎస్ యూనిట్ ఇంచార్జి వాకాడ గోపి అందించారు. గదల ఈశ్వర రావు ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స కు 90 లక్షల వ్యయం అవుతుంది. ఇప్పటి కి 50 లక్షలు పైగా సేకరించారు. విరాళాలు సేకరణ లో బాగంగా ఎస్ ఎం ఎస్ పరిశ్రమ యాజమాన్యం ని సాయం కోరారు. సాయం అందించే కార్యక్రమంలో గరివిడి మండల మాజీ జెడ్పిటిసి సభ్యులు వాకాడ శ్రీను, సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను, పరిశ్రమ ప్రతినిధి సరిది రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిక



**విజయనగరం ,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**

విజయనగరం పట్టణ పరిధిలోని 22వ డివిజన్ బాబామెట్టలో జనసేన పార్టీలోకి చేరికలు చోటుచేసు కున్నాయి. ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెదమజ్జి సత్యనారాయణ చొరవతో శనివారం దాదాపు 25 కుటుంబాలకు చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీమతి పాలవలస యశస్వి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలోకి వచ్చిన నూతన సభ్యులకు ఆమె గౌరవపూర్వకంగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గురాన అయ్యలు, నడిపెన శ్రీనివాసరావు, గంట్లాన పుష్ప కుమారి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన జనసేన అధినేత, పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు.

# విజయనగరం పార్వతీపురం మన్యం వార్త

## పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి



**తెర్లాం, సెప్టెంబర్ 26,(ప్రభాత వార్త ) :**

పోటీ పరీక్షలతో విద్యార్థులలో సృజనాత్మకతను, ప్రతిభ ను వెలికి వేయాలని, పోటీ పరీక్షల జిల్లా స్థాయి నిర్వహణ సమన్వయ కర్త వేమకోటి గిరి బాబు అన్నారు. శనివారం ఆయన పెరుమాలి ఏ పి మోడల్ స్కూల్ లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న "వికసిత భారత్ బి2047 "లో భాగంగా "సేవా సంకల్ప అభియాన్"ను పోటీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు గల విద్యార్థులకు డ్రాయింగ్ మరియు ఉపన్యాస పోటీలు ప్రభుత్వ పాఠశాలలలో నిర్వహించడం జరుగుచున్నదిని . ప్రతి విద్యార్థి ఈ పోటీ పరీక్షలలో పాల్గొవలన్నారు .మండలంలో గల అన్ని హై స్కూల్స్ మరియు యు .పి. స్కూల్స్ లలో ఈ పోటీల నిర్వహణ జరుగుచున్నదిని .ఈ పోటీలలో గెలుపొందిన వారు సెప్టెంబర్ 28 వ తేదీన మండల స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని .అదే విధముగా మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు కూడా అందజేయబడతాయని తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారి జే. త్రినాధరావు ఈ పోటీలను సమర్థవంతంగా నిర్వహణ జరుగుతున్న తీరును అభినందించడం జరిగింది. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి జి .జ్యోతిలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

## కోతకు గురైన కల్వర్టు పనులు పూర్తి



**దత్తిరాజేరు, సెప్టెంబర్ 26, ప్రభాత వార్త :**

మండలంలోని గడసాశీ మరియు పోరలి గ్రామాల మధ్య వర్షానికి దెబ్బతిన్న వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయడం జరిగిందని తాసిల్దార్ సురేష్ ఎంపీడీవో ఎస్ తాత అన్నారు. శనివారం ఆర్ అండ్ బి అధికారులుతో కలిసి వర్షానికి కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను శనివారం పరిశీలించామన్నారు. ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా దగ్గరుండి కల్వర్టు గండి పనులు పూర్తి చేశామన్నారు వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.. ఈకార్యక్రమంలో ఆర్ అండ్ బి డి ఈ . ఏ.ఈ. ఏ ఎస్ ఓ జగన్నాథం. పాల్గొన్నారు.

## చిన్నిపాలెంలో భారీ అన్నసమారాధన



**కొత్తవలస, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :**

మండలంలోని చిన్ని పాలెం పంచాయతీ లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు .సాయంత్రం మేళ తాళలతో వినాయక ఊరేగింపు నిర్వహించి భక్తి శ్రద్దలతో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపులో పిల్లలు పెద్దలు మహిళలు అధిక సంఖ్య లో పాల్గొని నృత్యలు చేస్తూ సందడి చేశారు.

## పారమ్మకొండను పర్యాటక కేంద్రంగా గుర్తింపు తీసుకొస్తా

**పాచిపెంట, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:**

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మండలంలో పనుకువలస పంచాయతీ లో ఈ ప్రాంత ఆరాధ్య దైవమైన శ్రీపారమ్మ తల్లి పాలమకొండ వద్ద పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి జాతీయ రాష్ట్ర స్థాయిలో ప్రారంభ యొక్క ప్రాచీన చరిత్రను ప్రాధాన్యతను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో తెలిసే విధంగా గుర్తింపు తీసుకొస్తామని రాష్ట్ర గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం ఆరంకొండ వద్ద పారమ్మ తల్లిని దర్శించుకుని సమావేశం ఏర్పాటు చేశారు. మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మికం, పర్యాతకం, ఆరోగ్యం ఒకేచోట ఉండాలన్నారు. కార్యక్రమం ఎంపీడీవో బీబీజే పాత్రో, ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలిత మంత్రి సంధ్యారాణికి గిరిజన పంచాయితీ ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ గిరిజన నృత్యం కోలాటాలతో స్వాగతం పలికారు. ఈక్రమంలో ఆర్డిఓ మాదిరీ టూరిజం శాఖ అధికారి వాణి, ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ మండల టిడిపి అధ్యక్షులు జి యుగంధర్, కమిటీ చైర్మన్ సన్యాసి డి ఎం ఎం హెచ్ ఓ విజయలక్ష్మి డి ఆర్ డి ఏ పిడి గిరిజన సంక్షేమ శాఖ డి డి వో , తహసిల్దార్ రవి సిడిపిఓ అనంతలక్ష్మి, ఇంజనీరింగ్ శాఖ అధికారి డి వి ఆర్ ఎం. రాజు సాలూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ఎస్సై ఎల్ అర్జున్ ప్రోగ్రాం అధికారి డాక్టరు శివకుమార్ మండల స్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్డబ్ల్యూఎస్ ప్రోజెక్ట్స్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

**బొబ్బిలి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:**



శాసనసభ్యులు ఆర్.వీ.ఎన్.కె.కె. రంగారావు (బేబీ నాయన) ప్రోజెక్ట్స్ శాఖ అధికారులతో బొబ్బిలి కోటలో రివ్యూ నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా బొబ్బిలి నియోజకవర్గానికి జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి మంజూరైన నిధుల వివరాలను అధికారులు ఎమ్మెల్యే కి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ (జీజీవీ) కింద గతంలో రద్దయిన తాగునీటి పథకాలను పునరుద్ధరించడానికి భారీగా నిధులను కేటాయించి పనులకు పునరుజ్జీవం కల్పించింది. అందులో భాగంగా, బొబ్బిలి నియోజకవర్గానికి రూ46.89 కోట్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

27-9pg10.qxd:27-9pg10.qxd 1/1/02 6:24 AM Page 1





## స్వదేశంలో మూడు మ్యాచ్‌ల వన్డే..
# నేటి నుండి వెస్టిండీస్‌తో భారత్ ఢీ



**న్యూఢిల్లీ:** భారత్, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 27 నుంచి స్వదేశంలోని తిరువనంతపురంలో జరగనుంది. ఈ పర్యటనలో ఇరు జట్లు 3 వన్డేలు, 5 టీ20లలో తలపడనున్నాయి. ఈ పోరులో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా బరిలోకి దిగనుంది. టీమిండియాకు సంబంధించి సెలక్టర్లు అత్యంత పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. అయితే తొలి మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడు. నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేస్తుండగా పేసర్ మహమ్మద్ సిరాజ్ వేసిన బంతి శుభ్‌మన్ గిల్ కుడి మోచేతికి బలంగా తాకడంతో ప్రాక్టీస్ ఆపేసాడు. గాయం చిన్నది కావడంతో బరిలోకి దిగనున్నాడు. శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో బిజీగా ఉండటం వల్ల ఈ సిరీస్‌కు అందుబాటులో లేడు. అయినప్పటికీ రుతురాజ్ గైక్వాడ్, ఆకిబ్ నబీ, నమన్ ధీర్‌వంటి యువఆటగాళ్లతో పాటు, రవీంద్రజడేజా కూడా జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. కొంతమంది స్టార్‌ఆటగాళ్లకు తొలి వన్డే తుది జట్టులో స్థానం దక్కడం సందేహంగా మారింది. కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా బరిలోకి దిగడం ఖాయం కాగా, మూడో స్థానంలో విరాట్ కోహ్లీ ఆడనున్నాడు. దీంతో టాప్ ఆర్డర్‌లో యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కడం కష్టంగా మారింది.అయితే గిల్ గాయంతో తొలి మ్యాచ్‌కు దూరమైతే జైస్వాల్ ఓపెనర్‌గా రానున్నాడు. శ్రేయస్ అయ్యర్ గైర్హాజరీలో ఖాళీ అయిన నంబర్4 స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. ఈ పొజిషన్‌లో రుతురాజ్ గైక్వాడ్‌ను ఆడించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గైక్వాడ్ ఇప్పటివరకు 9 వన్డేల్లో 228 పరుగులు సాధించాడు. ఇక వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఐదో స్థానంలో బరిలోకి దిగనుండగా, ఆల్ రౌండర్ల కోటాలో నితీశ్ కుమార్, రవీంద్ర జడేజా జట్టుకు అదనపు బలాన్ని చేకూర్చనున్నారు.

## బ్యాడ్మింటన్: ఓటమితో
# లక్ష్య నిష్క్రమణ

**ఇచినోమియా:** పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో, సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూ చేతిలో మూడు గేమ్‌ల తేడాతో ఓడిపోవడంతో లక్ష్యసేన్ ఆసియా క్రీడల ప్రయాణం ముగిసింది. ఇచినోమియాలో శనివారం జరిగిన మ్యాచ్‌లో, 13వ ర్యాంకు క్రీడాకారుడు



లోహ్‌ఆరంభంలో ఎదురైనఎదురుదెబ్బ నుండి కోలుకుని, ప్రపంచ 14వ ర్యాంకు క్రీడాకారుడైన సేన్‌ను 21-12, 15-21, 21-14 తేడాతో ఓడించాడు. సేన్ ప్రారంభ గేమ్‌ను బలంగా ప్రారంభించి, 5-1 ఆధిక్యానికి దూసుకుపోయాడు. లోహ్ అద్భుతమైన 10 పాయింట్ల పరంపరతో స్పందించి, పోటీని తన వైపుకు తిప్పుకుని, పట్టు సాధించాడు. ఈ సింగపూర్ ఆటగాడు తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, గేమ్‌ను 21-12 తేడాతో ముగించాడు. రెండో గేమ్‌లో భారత షట్లర్ సేన్ 21-15 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుని, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశాడు. చివరి గేమ్ హోరాహోరీగా సాగింది, కానీ లోహ్ క్రమంగా ఆధిక్యం సాధించి, విరామ సమయానికి 11-6తో ముందున్నాడు. సేన్‌పుంజుకుని, వరుసగా 4 పాయింట్లు సాధించి తేడాను 13-14కు తగ్గించి, ఆ తర్వాత 14-16కు చేరుకున్నాడు. అయితే లోహ్ వరుసగా మూడు పాయింట్లు సాధించి తన ఆధిక్యాన్ని తిరిగి పొందాడు. ఆ తర్వాత అతను మ్యాచ్ పాయింట్‌కు చేరుకోగా, సెన్ కొట్టిన రిటర్న్ షాట్ నెట్‌లోకి వెళ్లడంతో పోటీ ముగిసింది.

## ఆసియా క్రీడలు





# కబడ్డీలో భారత్‌కు డబుల్ టైటిల్స్
## పురుషులు, మహిళల జట్లకు స్వర్ణాలు

**తోకై:** ఆసియా క్రీడల కబడ్డీ ఫైనల్స్‌లో ఇరాన్‌పై విజయం సాధించడం ద్వారా భారత పురుషుల, మహిళల జట్లు రెండూ తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకోవడంతో, భారత్ డబుల్ స్వర్ణ పతకాలను సాధించింది.
హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో మహిళల జట్టు మొదట ఆధిక్యం సాధించి, ఇరాన్‌ను 37-34 తేడాతో ఓడించింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 22-16 ఆధిక్యంలో ఉండగా, రెండో అర్ధభాగంలో ఇరాన్ బలంగా పుంజుకుని, డిఫెండింగ్ ఛాంపియన్లపై 18-15 తేడాతో ఆధిక్యం సాధించింది. తొలి అర్ధభాగంలో లభించిన ఆధిక్యమే చివరికి నిర్ణయాత్మకంగా నిలిచింది. ఆ తర్వాత పురుషుల జట్టు మరో ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో ఇరాన్‌పై 40-34 తేడాతో విజయం సాధించి అదే ఘనతను అందుకుంది. స్కోర్లు 20-20తో సమంగా ఉన్నప్పుడు, రెండవ భాగంలో భారత్ ఆధిక్యం సాధించి మరో ఆసియా క్రీడల స్వర్ణాన్ని కైవసం చేసుకుంది.

## హాకీలో
# సెమీఫైనల్‌కు భారత్

**కకమిగహార:** డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్, శనివారం పూల్ ఎలో ఆతిథ్య జపాన్‌పై 2-0 తేడాతో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో విజయంసాధించి, 2026 ఆసియా క్రీడల పురుషుల హాకీ సెమీఫైనల్స్‌లో తమ స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలో జరిగిన గ్రూప్ దశలో, భారత్ వరుసగా నాలుగో విజయాన్ని కైవసం చేసుకుంది. మొదటి క్వార్టర్‌లో అభిషేక్ తొలిగోల్ చేయగా, మూడో క్వార్టర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ శక్తివంతమైన పెనాల్టీ



కార్నర్ ఫ్లిక్‌తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. జపాన్ దూకుడుగా ప్రారంభించి, వేగవంతమైన ఎదురుదాడిలతో భారత రక్షణ శ్రేణిని పరీక్షించింది. గోల్‌కీపర్ సూరజ్ కర్కెరా ఆరంభంలోనే రంగంలోకి దిగగా, మన్‌ప్రీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, అభిషేక్ ద్వారా భారత్ అనేక అవకాశాలను సృష్టించుకుంది. అభిషేక్ జపాన్ గోల్ కీపర్‌తకాషి యోషికావాను దాటి బంతిని పంపి, తొలి క్వార్టర్ ముగిసేసరికి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండవ క్వార్టర్‌లో కూడా జపాన్ దూకుడుగానే ప్రయత్నించినా, భారత రక్షణ వలయాన్ని ఛేదించలేకపోయింది. 40వ నిమిషంలో లభించిన ఆరో పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ బలంగా పంపించడంతో యోషికావాకు ఏమాత్రం అవకాశం లేకుండా పోయి భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లి విజయం సాధించింది.

ఆట



# మహిళల పరుగులో ప్రాచీకి కాంస్యం
## పురుషుల ఫైనల్‌కు అనిమేష్ అర్హత



**నాగోయా:** జపాన్‌లో జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026లో శనివారం జరిగిన మహిళల పరుగు పందెంలో భారత క్రీడాకారిణి ప్రాచీచౌదరి 53.21 సెకన్ల సమయంతో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మహిళల 400 మీటర్ల ఈవెంట్‌లో ప్రాచీ ఈ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె 53.21 సెకన్లలో రేసును పూర్తి చేసి పోడియం స్థానాన్ని దక్కించుకుంది. దీంతో ఐచినాగోయా గేమ్స్‌లో భారతదేశం యొక్క మొత్తం పతకాల సంఖ్య 30కి చేరింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, పన్నెండు రజతాలు, పద్నాలుగు కాంస్యాలకు పెరిగింది. ఇదిలా ఉండగా, మూడవ సెమీఫైనల్‌లో 20.81 సెకన్ల సమయంతో రెండవ స్థానంలో నిలిచిన అనిమేష్ కుజూర్ 200 మీటర్ల ఫైనల్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకున్నాడు. థాయిలాండ్‌కు చెందిన పురిపోల్ బూన్సన్ 20:10 సెకన్లలో రేసును పూర్తి చేసి కొత్త గేమ్స్ రికార్డును నెలకొల్పగా, అతని తర్వాత కుజూర్ నిలిచాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో స్థానం సంపాదించడంలో విఫలమైన ఈ భారత్ స్ప్రింటర్ ఇప్పుడు 200 మీటర్ల పతకాల రేసుకు అర్హత సాధించాడు. పురుష/ల 1500 మీటర్ల ఫైనల్‌లో కూడా భారత్ రెండు స్థానాలు దక్కించుకుంది. గుల్వీర్ సింగ్, యూనస్ షా వారి వారి హీట్‌ల నుండి అర్హత సాధించారు. హీట్ 2లో గుల్వీర్ 3:45.79 సమయంతో మూడవ స్థానంలో నిలవగా, హీట్ 1లో యూనస్ కూడా 3:45.77 సమయంతో మూడవ స్థానాన్ని పొందాడు.

వాణిజ్యం

## ఇపిఎఫ్ చందాదారులకు
# వడ్డీ జమ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) తమ చందాదారులకు ఊరటనిచ్చే ప్రకటన చేసింది. ఆర్థిక సంవత్సరం 2025-26కి సంబంధించిన ఇపిఎఫ్ వార్షిక వడ్డీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించింది. ఈసారి తీసుకొచ్చిన సరికొత్త ఆటోమేటెడ్ వార్షిక వడ్డీ విధానం ద్వారా ఎటువంటి టెక్నికల్ జాప్యం లేకుండా అత్యంత వేగంగా, పారదర్శకంగా, సింగిల్ క్లిక్‌తో పిఎఫ్ ఖాతాల్లో వడ్డీ జమ చేసినట్లు తెలిపింది. 34 కోట్లకు పైగా పిఎఫ్ ఖాతాల్లో రూ.1.44 లక్షల కోట్ల వడ్డీ డబ్బును జమ చేశామని తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఇపిఎఫ్ఒ ఓ పోస్ట్ చేసింది. ఇపిఎఫ్ఒ సంస్కరణలతో వడ్డీ జమ అనేది ఎలాంటి అడ్డంకులు లేకుండా వేగంగా జరుగుతోంది. ఆటోమేటెడ్ యాన్యువల్ ఇంట్రెస్ట్ క్రెడిట్ ద్వారా గత ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి 34 కోట్లకు పైగా ఇపిఎఫ్ మెంబర్ అకౌంట్లలో 8.25 శాతం వార్షిక వడ్డీ రేటుతో రూ.1.44 లక్షల కోట్లకు పైగా ఇంట్రెస్ట్ డబ్బులను జమ చేయజం జరిగింది. కొత్త వ్యవస్థతో చాలా వేగంగా, పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా వడ్డీ జమ పూర్తయిందని ఇపిఎఫ్ఒ వెల్లడించింది. మీ ఇపిఎఫ్ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్ నుంచి 9966044425 అనే నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా తక్షణమే బ్యాలెన్స్ ఎస్ఎంఎస్ రూపంలో మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి ఇపిఎఫ్ఒ యుఎఎన్ నంబరు టైప్‌చేసి 7738299899కి మెసేజ్ చేస్తే క్షణాల్లో బ్యాలెన్స్ రిప్లై వస్తుంది. ఉమాంగ్ యాప్ ఓపెన్ చేసి ఇపిఎఫ్ఒ సేవలను ఎంచుకోవాలి. వ్యూ పాస్‌బుక్ ఆప్షన్‌పై క్లిక్ చేసి, మీ యూనివర్సల్ అకౌంట్ నంబర్, ఒటిపి నమోదు చేయడం ద్వారా పాస్‌బుక్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# బంగారం రుణాల జోరుకు బ్రేక్
## వ్యక్తిగత రుణాలదే పైచేయి: యుబిఎస్



**ముంబయి, సెప్టెంబర్ 26:** దేశంలో అసురక్షిత రుణాల విభాగంలో కీలక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉందని యుబిఎస్ గ్లోబల్ రీసెర్చ్ పేర్కొంది. ఇప్పటివరకు వేగంగా పెరిగిన బంగారం రుణాల స్థానాన్ని మళ్లీ వ్యక్తిగత రుణాలు ఆక్రమించే అవకాశముందని తెలిపింది. బంగారం ధరలు స్థిరపడుతుండటంతో గోల్డ్ లోన్ల వృద్ధి మందగించవచ్చని, అదే సమయంలో వ్యక్తిగత రుణాల వృద్ధి పుంజుకుంటోందని వెల్లడించింది. యుబిఎస్ విడుదల చేసిన ఇండియా ఫైనాన్షియల్స్‌ది బిగినింగ్ ఆఫ్ యాన్ అన్‌సెక్యూర్డ్ అప్‌సైకిల్ నివేదిక ప్రకారం ఆగస్టులో ఎన్‌బిఎఫ్‌సిలు ఇచ్చే వ్యక్తిగత రుణాల వృద్ధి రెండేళ్ల గరిష్ఠానికి చేరింది. వార్షిక ప్రాతిపదికన ఇది సుమారు 30 శాతంగా నమోదైంది. బ్యాంకుల వ్యక్తిగత రుణాల వృద్ధి కూడా 9 శాతానికి చేరుకుంది. ఐదేళ్లలో ఐదు రెట్లు పెరిగిన గోల్డ్ లోన్ల వాటా 2025-26 ఆర్థిక సంవత్సరంలో బంగారం రుణాలు ఏకంగా 50 శాతం వృద్ధి చెందాయి. యుబిఎస్ పరిశీలించిన కాలంలో ఇదే అత్యంత వేగవంతమైన వృద్ధి. క్రెడిట్ బ్యూరో సిఆర్ఐఎఫ్ హైమార్క్ గణాంకాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో బంగారం రుణాల మొత్తం విలువ సుమారు రూ.18.6 లక్షల కోట్లుగా ఉంది.దేశ జిడిపిలో బంగారం రుణాల వాటా 2019 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదు రెట్లు పెరిగి 1 శాతం నుంచి 5 శాతానికి చేరింది.వ్యక్తిగత రుణాల్లో మళ్లీ జోరుగత రెండేళ్లుగా నియంత్రణ చర్యలు, రుణగ్రహీతలపై పెరిగిన రుణభారం కారణంగా వ్యక్తిగత రుణాల వృద్ధి మందగించింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతోందని యుబిఎస్ విశ్లేషకులు అలోక్ శ్రీవాస్తవ, యశ్ అగర్వాల్, కరణ్ పరేశ్ త్రివేది తెలిపారు.



# ఐపిఓకు వస్తున్న కోల్‌ఇండియా సబ్సిడరీలు

**ముంబయి, సెప్టెంబరు 26:** భారత ప్రభుత్వ రంగానికిచెందిన మైనింగ్ దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ తన అనుబంధ సంస్థల్ని వరుసగా ఐపిఒలకు తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. 2030 కల్లా మొత్తం తన 8 అనుబంధ కంపెనీలను స్టాక్ మార్కెట్లో నమోదుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ యేడాదిలోనే రెండు సబ్సిడరీలను ఐపిఒ ద్వారా మార్కెట్లోకి తీసుకొచ్చింది. ముందుగా భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ ఐపిఒ జనవరిలో వచ్చింది. జనవరి 9,13 మధ్య సబ్‌స్క్రిప్షన్ పూర్తి చేసుకొని జనవరి 19న ఎక్స్ఛేంజీల్లో లిస్టయింది. ఇది మంచి రిటర్న్స్ కూడా ఇచ్చింది. మరో సంస్థ సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ కూడా మార్చిలో పబ్లిక్ ఇష్యూ ద్వారా అడుగుపెట్టింది. మరోవైపు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా కోల్ ఇండియా కూడా తరచుగా వాటాల్ని విక్రయిస్తోంది. తాజాగా మరో రెండు ఐపిఒలను లైన్లో పెట్టింది. ఇప్పటికే ఇందులో మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ కూడా ఐపిఒ కోసం డిఆర్‌హెచ్‌పి సెబీకి దాఖలు చేసింది. దీనికింద సుమారు 66.18కోట్ల షేర్లను విక్రయించనున్నట్లు దాఖలు చేసిన పత్రాల్లో పేర్కొంది. కోల్ ఇండియా మరో అనుబంధ సంస్థ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ ఐపిఒను కూడా తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. దీని ద్వారా సుమారు 800 బిలియన్ డాలర్లు భారత కరెన్సీలో చూస్తే రూ. 7600 కోట్లకుపైగా నిధుల్ని సమీకరించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఈ ఐపిఒ పరిమాణం, తుది తేదీపై ఇంకా నిర్ణయం ఖరారు కాలేదు. ఈ కంపెనీ విషయానికి వస్తే కోల్ ఇండియా అతిపెద్ద అనుబంధ సంస్థల్లో ఒకటి. ఇది భారతదేశంలో సుమారు 60 బొగ్గు గనులను నిర్వహిస్తోంది. ప్రతిపాదిత ఐపిఒ కోసం కోల్ ఇండియా నాలుగు ప్రముఖ సంస్థలను మర్చంట్ బ్యాంకర్లుగా నియమించుకుంది. ఐసిఐసిఐ సెక్యూరిటీస్, ఎస్బీఐ క్యాపిటల్ మార్కెట్స్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, ఐడిబిఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్ ఈ ఇష్యూపై పనిచేయనున్నాయి.

## వచ్చే యేడాది తొలి ఆరు నెలల్లో
# ఔన్సు 5,000 డాలర్లకు పసిడి



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** బంగారం ధరలు ఈ యేడాది మిగిలిన కాలంలోనూ అధిక స్థాయిల్లో కొనసాగవచ్చని, వచ్చే యేడాది తొలి అర్ధభాగంలో మరింత పెరిగే అవకాశం ఉందని ఐసిఐసిఐ బ్యాంక్ పరిశోధన నివేదిక అంచనా వేసింది. 2027 ప్రథమార్థంలో బంగారం ధర ఔన్సుకు 4,600-5,000 డాలర్ల పరిధిలో ఉండొచ్చని బ్యాంక్ పేర్కొంది. 2026 మిగిలిన కాలంలో మాత్రం 4,200-4,600 డాలర్ల మధ్య కొనసాగవచ్చని తెలిపింది.సెప్టెంబరులో బంగారం ధరల్లో గణనీయమైన దిద్దుబాటు చోటుచేసుకున్నప్పటికీ, ఈ విలువైన లోహంపై పెట్టుబడి ఆకర్షణ కొనసాగుతుందని ఐసిఐసిఐ బ్యాంక్ అభిప్రాయపడింది. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, పెట్టుబడిదారుల నుంచి డిమాండ్, ఆర్థిక మరియు భౌగోళిక అనిశ్చితి సమయంలో రక్షణాత్మక పెట్టుబడిగా బంగారానికి ఉన్న ప్రాధాన్యం ధరలకు మద్దతు ఇస్తాయని పేర్కొంది. 2026లో రూ.1.40-1.60 లక్షల మధ్య ధ2026 మిగిలిన కాలంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఔన్సుకు 4,200-4,600 డాలర్ల పరిధిలో కొనసాగవచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ తెలిపింది. సమీప కాలంలో ధరల్లో మరింత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నప్పటికీ, వచ్చే యేడాది తొలి అర్ధభాగంలో స్వల్పంగా పైపైపు మొగ్గు చూపవచ్చని అంచనా వేసింది. దేశీయంగా బంగారం ధరలు ఈ యేడాది మిగిలిన కాలంలో 10 గ్రాములకు రూ.1.40 లక్షల నుంచి రూ.1.60 లక్షల పరిధిలో ఉండొచ్చన్న తన అంచనాను బ్యాంక్ కొనసాగించింది. ఆగస్టులో బంగారం ధరలు దాదాపు 9 శాతం పెరిగాయి. అదే సెప్టెంబరులో ఇప్పటివరకు సుమారు 8 శాతం తగ్గాయి.
అమెరికా ద్రవ్య విధానంపై మారుతున్న అంచనాలు ఈ దిద్దుబాటుకు ప్రధాన కారణమని ఐసిఐసిఐ బ్యాంక్ తెలిపింది. ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, పెరిగిన ముడిచమురు ధరలు, అంచనాల కంటే మెరుగ్గా వచ్చిన కార్మిక మార్కెట్ గణాంకాల నేపథ్యంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై మరింత కఠిన వైఖరి అవలంభించవచ్చన్న అంచనాలు పెరిగాయని పేర్కొంది.ఈ పరిణామాలు స్వల్పకాలంలో బంగారం ధరలపై ఒత్తిడి తెచ్చినప్పటికీ, దీర్ఘకాలికంగా బంగారానికి మద్దతునిచ్చే అంశాలు కొనసాగుతున్నాయని బ్యాంక్ తెలిపింది. బంగారం మార్కెట్‌కు పెట్టుబడిదారుల నిధులు రాక కీలక మద్దతుగా నిలుస్తోంది. ఆగస్టులో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి 17.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. మూడో త్రైమాసికంలో గోల్డ్ ఇటిఎఫ్‌లకు సంబంధించిన డిమాండ్ 144.7 టన్నులకు చేరింది.



# క్షీణించిన ఫారెక్స్ ఖజానా
## 14.89 బిలియన్ డాలర్లు తగ్గిన భారత్ విదేశీ మారక నిల్వలు

**ముంబై, సెప్టెంబరు 26:** భారత విదేశీ మారక నిల్వలు సెప్టెంబరు 18తో ముగిసిన వారంలో భారీగా తగ్గాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. దేశ విదేశీ మారక నిల్వలు 14.881 బిలియన్ డాలర్లు తగ్గి 765.901 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రధానంగా విదేశీ కరెన్సీ ఆస్తులు తగ్గడం ఇందుకు కారణమైంది. అంతకుముందు వారంలోనూ విదేశీ మారక నిల్వలు 4.924 బిలియన్ డాలర్లు తగ్గి 780.782 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 18తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సిఎ) 14.816 బిలియన్ డాలర్లు తగ్గి 630.980 బిలియన్ డాలర్లకు చేరాయి.

# 100% ఇ20తో నడిచే టయోటా ఇన్నోవా వచ్చేస్తోంది
## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** దేశవ్యాప్తంగా ఇ20 పెట్రోల్‌పై చర్చ జరుగుతున్న సమయంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. 100 శాతం ఇథనాల్‌తో నడిచే టయోటా ఇన్నోవాను అక్టోబరులో లాంచ్ చేయడానికి తనకు ఆహ్వానం అందిందని ఆయన తెలిపారు. గడ్కరీ చెప్పిన వివరాల ప్రకారం ఈ వాహనానికి అసలు పెట్రోల్ అవసరమే ఉండదు. ఇంకా ఇది 100 శాతం ఇథనాల్‌తోనే నడిచే ఫ్లెక్స్ ఫ్యూయెల్ వాహనంగా ఉంటుంది. కారు నడుస్తున్న సమయంలో 60 శాతం వరకు విద్యుత్ ఉత్పత్తి కూడా చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కారు వినియోగ వ్యయం చాలా తక్కువ అని స్పష్టం చేశారు. పెట్రోల్ లీటరుకు రూ. 25 ఉన్నట్లుగా దీని నిర్వహణ ఖర్చు ఉంటుందని గడ్కరీ చెప్పారు. అయితే ఈ ఇంధనం పెట్రోల్ వద్ద మాత్రం ఉండదు. సాధారణంగా పెట్రోల్ ధరతో పోల్చి గడ్కరీ వేసిన అంచనా. టయోటా నుంచి అధికారికంగా ధర లేదా కిలో మీటరుకు ఖర్చు వివరాల్ని ఇంకా ప్రకటించలేదు. 100 శాతం ఇథనాల్ వాహన టెక్నాలజీపై టయోటా ఇప్పటికే పనిచేస్తోంది. 2023లో టయోటా ఇన్నోవా హైక్రాస్ ఆధారంగా ఎలక్ట్రిఫైడ్ ఫ్లెక్స్ ఫ్యూయెల్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ప్రోటోటైప్‌ను ప్రదర్శించింది. ఈ వాహనం ఇ20 నుంచి 100 శాతం ఇథనాల్ వరకు వేర్వేరు ఇంధన మిశ్రమాలతో పనిచేసేలా రూపొందించారు. మరోవైపు ఇథనాల్‌ను ప్రోత్సహించడం వల్ల మొక్కజొన్న, చెరకు వంటి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని గడ్కరీ చెబుతున్నారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్ తయారీ ద్వారా యుపి, బీహార్ రైతులకు రూ. 45 వేల కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇథనాల్ సహా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలను ప్రోత్సహించడం ద్వారా పెట్రోల్, డీజిల్‌పై ఆధారపడటాన్ని తగ్గించాలన్నది ప్రభుత్వ విధానంలో భాగంగా ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.